
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 07.08.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 10 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



- హోదా లేదంటున్న కేంద్రం
- గట్టిగా పట్టుబట్టని రాష్ట్ర ప్రభుత్వం
- ధుమ్మెత్తి పోస్తున్న ప్రతిపక్షం
- గుక్కతిప్పకోలేకున్న అధికారపక్షం

# 'ప్రత్యేక' మంటల్లో ప్రభుత్వం

**ప్రపంచంలో అతిపెద్ద పార్లమెంటు వ్యవస్థ కలిగిన దేశం మనది. అలాంటి పార్లమెంటులో జరిగిన అతిపెద్ద మోసం ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లుకు ఆమోదం పొందడం. ఇందులో ఇంకా మోసం ఏంటంటే విభజన సందర్భంగా అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్‌కు పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను గాలికొదిలేయడం. పార్లమెంటు సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన ఈ అన్యాయంలో దేశంలోని మెజార్టీ పార్టీలకు వాటా ఉందన్నది కాదనలేని వాస్తవం.**

విభజన బిల్లును పార్లమెంటులో పెట్టినప్పుడు గత యూపిఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్లపాటు ప్రత్యేక హోదా కల్పిస్తామని చెబితే, లేదు పదేళ్లు కావాలంటూ పట్టుబట్టింది ప్రతిపక్షంగా వున్న బీజేపీయే! కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసింది, బిడ్డను బయటకు తీసి తల్లిని చంపేసిందంటూ ఆరోజు నరేంద్ర మోడీ కూడా సానుభూతి వ్యాఖ్యలు చేసాడు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని, బీజేపీ నాయకులు కార్చిన కన్నీళ్లను చూసి ఆ పార్టీ కేంద్రంలో అధికారం చేపడితే మన తలరాత మారుతుందనుకున్నాం. నిజంగానే మారిపోయింది. రాష్ట్ర ప్రజల బ్రతుకులు మరింత దుర్భరంగా మారాయి.

కేంద్రం నుండి రాష్ట్రానికి ఆవగింజంత సాయం కూడా అందడం లేదు. మేం అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్ల పాటు ప్రత్యేక హోదా కల్పిస్తామన్న బీజేపీ నాయకులు, ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదు... సరికదా, యూపిఏ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 5ఏళ్ల ప్రత్యేక హోదా కూడా అడ్రస్ లేకుండా పోయింది. దేశంలో ఏ రాష్ట్రానికి కూడా ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని ఇటీవలే పార్లమెంటులో కేంద్రమంత్రి జితేంద్రసింగ్ చేసిన ప్రకటన రాష్ట్ర ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. కేంద్రమంత్రి ప్రకటన విన్న తర్వాతే రాష్ట్రంలోని విపక్షాలు ఉద్యమాలకు దిగుతున్నాయి. ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా కోసం పార్లమెంటు ముందే ధర్నాకు దిగనున్నారు. కమ్యూనిష్టులు కూడా ప్రత్యేకహోదాపై (మిగతా 2వ పేజీలో)

# తిరుమల గిరిగా సింహపురి



5లో

## వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సౌజన్యంతో శ్రీ వెంకటేశ్వర వైభవం



# మౌనం వీడని ఆనం

## పార్టీ మార్పుపై కొనసాగుతున్న సస్పెన్స్!

***నెల్లూరుజిల్లాలో గత కొన్ని రోజులుగా ఒక సంచలన రాజకీయ టాపిక్ హల్‌చల్ చేస్తుంది. అదే... ఆనం సోదరులు కాంగ్రెస్‌పార్టీని వీడి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరనున్నారని. పబ్లిక్‌లోనే కాదు, మీడియాలోనూ ఇదే టాక్. ఇదే టాపిక్. అయితే ఇంతవరకు ఆనం సోదరులు తాము కాంగ్రెస్‌ను వదులుతున్నామని గాని, వైసిపిలో చేరుతున్నామని గాని ఎక్కడా చెప్పలేదు. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే కాబట్టి వాళ్ల వైసిపి ప్రవేశ వూహాగానాలను కొట్టి పారేయలేం కూడా!***

ఈమధ్య అనంతపురం జిల్లాలో కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ పర్యటించారు. కాంగ్రెస్‌లో ఉండే గల్లీ, ఢిల్లీ నాయకులు కూడా (మిగతా 2వ పేజీలో)





## అన్నమాచార్య 607వ జయంతి

# శ్రవణానందంగా స్వరార్చన









ప్రతియేటలాగే ఈ ఏడాది కూడా అన్నమాచార్య జయంతి వేడుకలను అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటి ఆధ్వర్యంలో ఆగష్టు 1వ తేదీ శనివారం సాయంత్రం అన్నమయ్య సర్కిల్‌లో వేడుకగా జరిపారు. ఈసారి వేడుకలలో తిరుమల తిరుపతి దేవస్థానాల అధ్యక్షుడు చదలవాడ కృష్ణమూర్తి విశిష్ఠ అతిథిగా పాల్గొనడం ఓ విశేషమైతే, ప్రఖ్యాత సంగీత కళాకారుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గానామృతం మరో ఆకర్షణగా నిలిచాయి.

ముందుగా స్థానిక సంగీత గురువులు శ్రీమతి లక్ష్మీప్రసన్న, శ్రీమతి బాలార్క, శ్రీమతి రమాదేవి, శ్రీమతి దేవసేన, శ్రీమతి పద్మచక్రవర్తి, శ్రీమతి వనజలత శిష్యులతో పాటు ప్రభుత్వ సంగీత పాఠశాల విద్యార్థినులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు సంగీతప్రియులను భక్తిసాగరంలో ముంచెత్తగా, గురుకృప కళాక్షేత్రం సారధి శ్రీమతి సురభి గాయత్రి శిష్యులు గానంతో పాటు చేసిన నృత్యం కూడా ఆకట్టుకున్నాయి. అన్నమయ్య గీతంతో చిన్నారి ఆశ్రితారెడ్డి చేసిన నృత్యానికి కరతాళ ధ్వనులు మారుమ్రోగాయి. ఇస్కాన్ మందిరం నిర్వాహకులు సుఖదేవస్వామి నేతృత్వంలో ఇదే వేదికపై జరిగిన భజన కూడా అందరినీ అలరించింది.

బాలకృష్ణ ప్రసాద్, శ్రీమతి బుల్లెమ్మలు చేసిన "అన్నమయ్య" స్వరార్చన సాక్షాత్తూ తిరుమలలో వున్న అనుభూతిని కలిగించింది. తిరుమల తిరుపతి దేవస్థానాల అధ్యక్షుడిగా తొలిసారిగా నెల్లూరుకు విచ్చేసిన చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ స్వామివారి సేవలో తరించే భాగ్యం తనకు కలగడం ఎంత అదృష్టమో తాళ్ళపాకలో జరిగిన అన్నమాచార్య 607వ జయంతిలో తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి కార్యక్రమంగా పాల్గొనడం తనకు అంతే సంతోషాన్నిచ్చిందని అన్నారు.

స్థానికంగా నెల్లూరులో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సేవలో తరిస్తున్న అనేక సంస్థలు, అలాగే నెల్లూరుజిల్లా ప్రజల కోరికమేరకు నెల్లూరు దర్గామిట్టలో వున్న టిటిడి కల్యాణ మండపాన్ని ఆధునీకరించి పునర్నిర్మించే విషయాన్ని బోర్డు దృష్టికి తీసుకెళ్ళి కల్యాణ మండపానికి కొత్త శోభను తెచ్చే ప్రయత్నం చేస్తానని, తన ప్రయత్నానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లాంటి వధాన్యుల సహకారం కూడా అవసరమని చెప్పాడు. ఈ సందర్భంగా నెల్లూరీయుల పక్షాన చదలవాడ కృష్ణమూర్తిని అన్నమయ్య జయంత్యోత్సవ కమిటి అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సత్కరించాడు.

తిరుమల తిరుపతి దేవస్థానాల జెఇఓ పోలా భాస్కర్‌తో పాటు జిల్లా యస్.పి. డాక్టర్ గజరావుభూపాల్ కూడా ఆసాంతం కార్యక్రమాన్ని తిలకించి అన్నమయ్య గీతాలను ఆలకించారు.

సంగీతాభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో గీతాలాపన చేసిన చిన్నారులతో పాటు వాయిద్య సహకారం అందించిన కళాకారులందరికీ తామా మోహన్‌రాజ్ తయారు చేసిచ్చిన జ్ఞాపికలను బహుకరించారు.

కమిటి ఉపాధ్యక్షులు మురళీకృష్ణ హోటల్స్ సారధి వీరిశెట్టి హజరత్‌బాబు నేతృత్వంలో జరిగిన ప్రసాద వినియోగం భక్తులు, సంగీతప్రియుల అభినందనలను అందుకుంది. కమిటి ముఖ్యసమన్వయకర్తుంగా శివప్రభాత్‌రెడ్డితో పాటు కార్యనిర్వాహక సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, దండమూడి హేమంత్ కుమార్, కనుమూరు శ్రీనివాసులురెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి, కళాంజలి అనంత్, బి.వి.నరసింహం, బట్రెడ్డి వెంకట కృష్ణారెడ్డి, గుమ్మడి శ్రీనివాసులురెడ్డి, తామా మోహన్‌రాజ్, వట్టిగుంట చంద్రయ్యచౌదరి, కె.విజయకుమార్, గోళ్ళమూడి శ్రీధర్‌రెడ్డి, యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్, ముడి శోభన్‌కుమార్‌రెడ్డి, యస్.వి.సురేష్, వీరిశెట్టి సుధాకర్, దువ్వూరు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో
# పట్టపగలే భారీ దోపిడీ

గుర్తుతెలియని ఆగంతకులు బ్యాంకులలోకి, బంగారు దుకాణాలలోకి రావడం, తుపాకులు చూపి బెదిరించి అక్కడున్న నగదు, నగలు మూటగట్టుకు పోవడం నెల్లూరోళ్లు సినిమాలలోనే చూస్తుంటారు. అంతేగాని, ప్రత్యక్షంగా ఇలాంటి దోపిడీలు ఇక్కడ జరగలేదు. వ్యాపారులకు ఈ జిల్లాలో ఆ విధమైన భద్రత ఇంతకాలం ఉండేది. ఇప్పుడా నమ్మకం ఎగిరిపోయింది.

ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 1.50గంటల ప్రాంతంలో నెల్లూరు నగరం నడిబొడ్డున కాపువీధిలోని జయంతి జ్యూయలర్స్‌లో భారీ దోపిడీ జరిగింది. గుర్తు తెలియని ముగ్గురు ఆగంతకులు షాపులోకి వచ్చారు. అక్కడున్న శాత్‌మల్‌జైన్, హిమన్షులను తుపాకులతో బెదిరించి, 40లక్షల విలువచేసే ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. కేవలం 10నిముషాల వ్యవధిలోనే వచ్చిన వాళ్లు పని ముగించుకుని వెళ్లిపోయారు. పట్టపగలే ఈ దోపిడీ జరగడంతో నగరంలోని వ్యాపారులు భయాందోళనలకు గురవుతున్నారు.

# ప్రత్యేక మంటల్లో ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

పోరాటానికి సై అంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రత్యేకహోదాపై ఏమీ మాట్లాడలేకపోతోంది. కేంద్రంలో చంద్రబాబు ఆటలు సాగడం లేదు. గత ఎన్డీఏ ప్రభుత్వంలో లాగా చంద్రబాబుకు ఇప్పుడు చక్రం తిప్పే పరిస్థితి లేదు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు గట్టిగా మాట్లాడలేడు. ఒకవేళ మాట్లాడాడంటే, వాళ్లు ఎన్డీఏ నుండి బయటకు పంపించేటట్లున్నారు. చంద్రబాబుపై ఆధారపడి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మనుగడ సాగిస్తుంటే ఆ పరిస్థితి వేరు. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం మీదే చంద్రబాబు ఆధారపడ్డాడు. 'ఓటు – నోటు' వంటి ఎన్నో సమస్యలు ఆయనను చుట్టుముట్టి వున్నాయి. వీటన్నింటి నుండి బయటపడాలంటే కేంద్రం అండ కావాలి. కాబట్టి ప్రత్యేక హోదా కోసం చంద్రబాబు ప్రయత్నించేదీ లేదు, పాడూ లేదు.

ఆంధ్రప్రదేశ్‌లోని 13జిల్లాలు, అందులోనూ రెడ్ల మీద కక్ష గట్టే సోనియాగాంధీ విభజనకు పూనుకుంది. ఈ రాష్ట్రంలో రెడ్లంతా జగన్ వైపు వెళ్లారనే కోపంతోనే ఆమె రాష్ట్రాన్ని నిలువునా నరికింది. మరి ఈ 13జిల్లాల ఆంధ్రప్రదేశ్‌పై బీజేపీ నాయకులకు కోపం ఎందుకు? రాష్ట్రం పట్ల ఇంత వివక్ష చూపాల్సిన అవసరమేముందనే అనుమానాలు రావడం సహజం. దీనికి రెండు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలున్నాయి. ఆ రాష్ట్రం ఎప్పటి నుండో ప్రత్యేకహోదా కోసం డిమాండ్ చేస్తుంది. ఆ రాష్ట్రంలో అధికారం కోసం బీజేపీ పోరాడుతోంది. బీహార్‌కు ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తే ఎన్నికల్లో బీజేపీపై అది ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. బీహార్ ఎన్నికలవల్లే కేంద్రం ఏపి నోట్లో మట్టికొడుతుంది. బీహార్ ఎన్నికలయ్యేదాకా ఈ రాష్ట్రాన్ని పట్టించుకోక పోవచ్చు.

రెండోది ఏపిలో బలపడాలి అన్నది బీజేపీ అధిష్టానం ఆలోచన. అయితే రాష్ట్రంలో టీడీపీతో పొత్తు వాళ్ల బలోపేతానికి ప్రతిబంధకంగా మారుతోంది. చంద్రబాబు తెగదెంపులు చేసుకుంటే, రాష్ట్రానికి ప్రత్యేకహోదా వంటి ప్రయోజనాలను నేరుగా అమలు చేసి రాజకీయంగా లబ్ది పొందాలనే ఆలోచన కూడా వుంది. అయితే చంద్రబాబును వాళ్లు వదిలించు కోవాలనుకుంటున్నా, వాళ్లను చంద్రబాబు వదిలే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రయోజనాలకు వీరిద్దరి పొత్తు శాపంగానే మారింది.

రాజకీయ ప్రయోజనాల కోణంలో 'ప్రత్యేకహోదా' అంశం సాగుతోంది. చంద్రబాబు, విపక్షాలు పోరాడినా ఫలితం వచ్చేటట్లు లేదు. కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది. వాళ్లకు రాజకీయంగా ఇక లాభం కలుగుతుంది అనుకున్నప్పుడే ఆంధ్రప్రదేశ్ గురించి ఆలోచించేటట్లున్నారు.

## కాలధర్మం
# సన్నపురెడ్డి జనార్ధన్‌రెడ్డి



శ్రీనివాస ట్రాక్టర్ స్పేర్స్ వ్యవస్థాపకుడు, కోవూరు వాస్తవ్యుడు కీ॥శే॥ సన్నపురెడ్డి వెంకట సుబ్బారెడ్డి పెద్ద కుమారుడు జనార్ధన్‌రెడ్డి(65) ఆగష్టు 3వతేదీ పరమపదించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె వున్నారు. కుమారుడు అనీల్‌రెడ్డి బెంగుళూరులో స్థిరపడ్డాడు, జనార్ధన్‌రెడ్డి అల్లుడు బద్వేలు సుబ్బారెడ్డి వంశీరామ్ బిల్డర్స్ అధినేతగా అందరికీ సుపరిచితుడే. అనారోగ్యంతో బెంగుళూరులో కుమారుడి వద్ద వుంటుండిన జనార్ధన్‌రెడ్డి 3వ తేదీ సోమవారం నాడు తుదిశ్వాస విడిచాడు. జొన్నవాడ దేవస్థాన మాజీఛైర్మెన్ సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి, హైదరాబాద్‌లో నిర్మాణ రంగంలో వున్న సన్నపురెడ్డి మధుసూధన్‌రెడ్డి, తండ్రి వారసత్వంతో నెల్లూరులో ట్రాక్టర్ స్పేర్స్ వ్యాపారం చేస్తున్న రవిప్రసాద్‌రెడ్డి ఈ ముగ్గురూ జనార్ధన్‌రెడ్డి తమ్ముళ్ళు.

జనార్ధన్‌రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# మౌనం వీడని ఆనం

(మొదటిపేజీ తరువాయి)

అనంతపురంకు పరుగెత్తారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు పెద్ద నాయకులు ఆనం సోదరులే. వాళ్లు మాత్రం రాహుల్ పర్యటనకు పోలేదు. అప్పటి నుండే ఆనం బ్రదర్స్ పార్టీ మారనున్నారనే ప్రచారం వచ్చింది. అయితే తాజాగా విజయవాడలో జరిగిన కాంగ్రెస్‌పార్టీ సమావేశంలో పాల్గొనడం ద్వారా ఆనం రామనారాయణరెడ్డి మళ్ళీ అందర్నీ సందిగ్ధంలో పడేసారు.

ఆనం సోదరులలో ఇప్పటికే ఆనం జయకుమార్‌రెడ్డి తెలుగుదేశంలో చేరారు. మిగిలిన ముగ్గురు సోదరులు కాంగ్రెస్‌లో వున్నారు. ఎన్నికలకు ముందే తమ పార్టీలో చేరమని ఆనం రామనారాయణరెడ్డిని చంద్రబాబు ఆహ్వానించాడు. ఆనం ఆరోజు పార్టీలో చేరుంటే ఆత్మకూరు సీటు ఆయనదే! ఆత్మకూరుతో పాటు నెల్లూరు లోక్‌సభ సీటు కూడా తెలుగుదేశం గెలుచుండేది. సుడి వుంటే ఈరోజు జిల్లాలో వున్న పరిస్థితులను బట్టి మంత్రి కూడా అయ్యుండేవాడు. బ్యాడ్‌లక్... ఆరోజులు అలా గడిచిపోయాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు భవిష్యత్ కనిపించడం లేదు. బొత్స సత్యనారాయణ వంటి నాయకులే కాంగ్రెస్‌ను వదిలి పోయారు. కాంగ్రెస్‌ను వదలాలనే ఆలోచన ఇప్పట్లో ఆనం వివేకాకు లేనట్లుంది గాని, రామనారాయణరెడ్డి మాత్రం రాజకీయ భవిష్యత్‌పై ఆలోచన చేస్తున్నట్లుంది. ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరతాడనే అంశాన్నే చాలామంది నమ్మలేకున్నారు. ఎందుకంటే ఎన్నికలకు ముందు జగన్‌ను అత్యంత ఘోరంగా విమర్శించినవారిలో ఆనం సోదరులు ముందుంటారు. ఆనాటి విమర్శలు చూస్తే ఇక జన్మలో జగన్ దరిదాపులకు వీళ్లు పోరు, వీళ్ళ ముఖం జగన్ చూడడు అనిపించేది. రాజకీయాల్లో ఇవన్నీ పట్టించుకున్నోడు పైకి రాలేడు, పదవిలోకి పోలేడు. గత ఎన్నికలకు ముందు జగన్ కొంతవరకు ఇవి పట్టించుకోబట్టే దెబ్బతిన్నాడు. ఇప్పుడు ఆయన వాస్తవ లోకంలోకి వచ్చినట్లుంది. బొత్సను చేర్చుకోగా లేనిది, నెల్లూరుజిల్లాలో పెద్దవర్గమున్న ఆనం రామనారాయణరెడ్డి పార్టీలోకి వస్తానంటే వద్దంటాడా? పార్టీలో ముందు చేరిన బొత్స సత్తిబాబు కూడా ఆనం బ్రదర్స్‌ను వైసిపిలోకి లాగే ప్రయత్నం చేస్తున్నట్లు భోగట్టా!

కాని ఆనం సోదరులు వైకాపాలో చేరితే జిల్లాలో ఇప్పటికే వున్న కొంతమంది నాయకులకు ఇబ్బంది కలగొచ్చు. ముఖ్యంగా మేకపాటి ఆధిపత్యానికి గండి పడే అవకాశముంది. ఈరోజుకు కూడా జిల్లా పెత్తనం మాదే అన్నట్లున్నారు. ఆనం పార్టీలో చేరితే మేకపాటి ప్రభావం తగ్గిపోతుంది. కాబట్టే ఆనం పార్టీలో చేరే అంశాన్ని మేకపాటి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆనం రామనారాయణరెడ్డి వైకాపాలో చేరుతాడా? కాంగ్రెస్‌లోనే ఉంటాడా? అన్న టాపిక్ అర్ధాంతరంగా ముగిసిన 'బాహుబలి' సినిమా కథలాగా వుంది. ఆనం నోరు విప్పి ఏదో ఒకటి చెబితే ఈ సస్పెన్స్‌కు తెరపడుతుంది.

# అమ్మా నాన్నలే మాకు ఆదర్శం

**దృఢమైన విశ్వాసంతో వేసే ప్రతి అడుగు ఆత్మస్థైర్యంతో వేసి తల పైకెత్తుకుని ఆకాశమే హద్దుగా నక్షత్రాలే లక్ష్యంగా ముందుకు సాగాలని మాకు బోధించేవారు మా 'అమ్మా నాన్న'లు.**

వందేమాతరం, స్వరాజ్యం నా జన్మ హక్కు... అంటూ స్వాతంత్ర్య సమరం పతాకస్థాయిలో సాగుతున్న తరుణంలో 1945లో నెల్లూరుజిల్లా సౌత్ ఆములూరు గ్రామంలో మా నాన్న నంబూరు మోహన్‌రావు ఓ మధ్య తరగతి రైతుకుటుంబంలో జన్మించారు. అదే యేడాది అదే గ్రామంలో మా అమ్మ సులోచన ఓ ఉన్నత శ్రేణి కుటుంబంలో పుట్టింది. ఇద్దరూ ఒకే బడిలో చదువుతూ స్నేహితులయ్యారు. వారిద్దరి స్నేహం ప్రేమగా మారింది. వీరిద్దరి ప్రేమకి మా అమ్మ కుటుంబం అభ్యంతరం చెప్పింది. అయినా వీరి ప్రేమ అన్ని అడ్డంకులను, అవరోధాలను అధిగమించి వివాహబంధంగా మారింది. పెళ్లైన వెంటనే కొత్త దంపతులిద్దరూ తమ నివాసం హైదరాబాద్‌కు మార్చారు. కొత్త జీవితాన్ని ప్రారంభించారు. అయితే 20యేళ్ల ప్రాయంలో వ్యాపారవేత్తగా ఎదగాలనుకున్న మా నాన్న ప్రయత్నం ఫలించలేదు. చిన్న వయస్సు, అనుభవం లేని వ్యాపారం... ఫలితంగా నష్టం. యేళ్ళు గడిచాయి. మా అన్న, నేను పుట్టాం. మా ఇద్దరినీ తీసుకుని మళ్లీ మా స్వగ్రామం ఆములూరు చేరుకున్న మా అమ్మా నాన్న వ్యవసాయం చేయడం మొదలుపెట్టారు.

ఏదో సాధించాలన్న ఆశ, సాధించగలనన్న నమ్మకం మా నాన్నను ముందుకు నడిపించాయి. ఓ వైపు వ్యవసాయం చేస్తూనే మరోవైపు చిన్న కోళ్లఫారాన్ని ప్రారంభించి దాని బాగోగులు చూసుకునే బాధ్యత అమ్మపై పెట్టారు. నెల్లూరులో తమ బిడ్డలు బాగా చదువుకోవాలనే ఆలోచనతో మా అన్నను ఓ ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించారు. ఇక నావంతు వచ్చేసరికి పెద్ద చర్చే జరిగింది. ఇద్దరు పిల్లలకు ఇంగ్లీషు చదువంటే ఖర్చుతో కూడిన పని, రెండవ అబ్బాయిని ఈ ఊర్లోనే వీధి బడిలో చేర్చండి అంటూ మా సమీప బంధువర్గం సలహా ఇచ్చింది. కానీ మా అమ్మానాన్నలు వారెవ్వరి మాటలూ వినలేదు. నన్ను కూడా నెల్లూరులో కాన్వెంటులోనే చేర్పించారు. మా ఇద్దరికీ ఇంగ్లీషు చదువు చెప్పించాలనే ఆశతో వాళ్లిద్దరూ రాత్రి పగలూ కష్టపడాలని నిర్ణయించుకున్నారు. అవసరమైతే ఓ పూట భోజనం మానేయడానికి కూడా సిద్ధపడ్డారు.

శ్రీ నంబూరు మోహన్‌రావు - శ్రీమతి సులోచన




ఎలాగైనా తన బిడ్డలిద్దరినీ ఇంగ్లీషు మీడియంలోనే చదివించాలన్న దృఢమైన పట్టుదలతో మా కోళ్ల ఫారంలోని పనులన్నీ ఒంటిచేత్తో తానే చేసుకోవడం మొదలుపెట్టింది మా అమ్మ. కూలీలను పిలిపించి చేయించుకునే పనికి, నెలకు ఖర్చయ్యే 25 రూపాయలను మా చదువుల కోసం పొదుపు చేయాలన్నదే అమ్మ ధ్యేయం. అందుకు తగినట్లుగా ఆమె శ్రమించింది, చెమటోడ్చింది.

అంతలోనే మా జీవితాల్లో ఓ కుదుపు ఏర్పడింది. మా నాన్న వాళ్ల పూరిల్లు అగ్ని ప్రమాదానికి కాలి బూడిదై నేలమట్టమైపోయింది. ఈ ప్రమాదంలో నేను తీవ్రంగా గాయపడ్డాను. ఈ సంఘటనే మా కుటుంబాన్ని ఓ పెద్ద మలుపు తిప్పింది. ఉండడానికి నీడ కూడా లేని మా అమ్మానాన్నలను మా పెద్దమ్మ నూతలపాటి వనమ్మ, పెదనాన్న సుందరరామనాయుడు స్వాగతించి మాకు అండగా నిలిచారు. కష్టసమయంలో మూలస్థంభంలా నిలబడిన మా పెద్దమ్మ మా కుటుంబానికి బలమయ్యింది. మా అమ్మా, నాన్నల జీవితాలను తిరిగి నిలబెట్టుకోవడానికి ఆమె ముఖ్యకారణమైంది. మా జీవితాల్లోని ప్రతి విజయానికీ మేము మా పెద్దమ్మకి ఋణపడి వున్నాం... వుంటాం కూడా!

ఆ సమయంలో మా అమ్మ, పెద్దమ్మల సంరక్షణలో 5మంది అవ్వలు వుండేవాళ్ళు. ఒక్క మా అమ్మమ్మ మినహా మిగిలిన వారందరూ మాకు బంధువులు మాత్రమే. వీరంతా మా అమ్మ, పెద్దమ్మల వద్ద వుండడానికే ఇష్టపడేవారు. మా కుటుంబంలో మా అమ్మ, పెద్దమ్మ, నాన్న, పెదనాన్న వాళ్లపైన చూపించే ప్రేమ ఆప్యాయతలతో పాటు తమ సొంత కుటుంబంలో వారికి ఆదరణ లేకపోవడం వంటి అనేక కారణాలు వారికి ఈ పరిస్థితులు కల్పించాయి. అయితే ఆర్థిక స్తోమత లేకపోయినా తమకున్న దాంట్లోనే వారందరినీ దేవతల్లా చూసుకుని పెద్దల పట్ల మనమెలా వుండాలో మా చిన్ననాడే మాకు నేర్పించారు మా అమ్మా నాన్నలు.

ఆరోజుల్లో నెల్లూరుజిల్లాలోనే ప్రముఖమైన స్కూలు సెయింట్‌జోసెఫ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నేను, మా అన్న చదువుకున్నాం. మా స్నేహితులు, సహ విద్యార్థులు ధనిక మరియు ప్రముఖ కుటుంబాలకు చెందిన పిల్లలు ఉండేవాళ్ళు. మేము పెరిగి పెద్దవాళ్లమైన తర్వాత మంచి అవకాశాలు పొందడంలో ఆ పిల్లలతో ఏ మాత్రం పోటీ పడలేమని మా అమ్మా నాన్నలకు తెలుసును. అందుకని వాళ్ళు ప్రతి ఆదివారం మా ఇంట్లో ఇల్లు చిమ్మడం, పాత్రలు కడగడం, బట్టలుతకడం, బాత్ రూంలను శుభ్రం చేయడం వంటి పనులను మాకు నేర్పించారు. అదే విధంగా పొలంలో ఏ విధంగా కాయకష్టం చేయాలో కూడా మాకు మా అమ్మా, నాన్న నేర్పారు. చేసే పని స్థాయిని బట్టి కాకుండా మనం చేసే పని ఏదైనా ఆ పనిలోని ఆనందాన్ని ఆస్వాదిస్తూ చేస్తే వచ్చే సంతృప్తి మాకు చిన్నతనంలోనే తెలిసింది.

చిన్నతనంలోనే కష్టపడితే భావి జీవితం ఉజ్వలంగా వుంటుందని వాళ్లు మాకు బోధించేవారు. అలా కష్టపడితే ఆ పిల్లలతో ధీటుగా ఎదగవచ్చని వాళ్లు మాకు చెప్పేవాళ్ళు. డబ్బుతో మనం పోటీ పడలేమని, కేవలం మన శ్రమతో మంచి నైపుణ్యం గల పనులను చేసి ఆ విధంగా వారితో పోటీ పడగలమని మా అమ్మానాన్నలు మాకు హితబోధ చేసేవారు. ఈ పోటీ ప్రపంచంలో ఏ విధంగా జీవితాన్ని గడపాలో వారు మాకు నిత్యం నూరిపోసేవారు.

సమర్థత గలిగిన గృహిణిగా, బాధ్యతాయుతమైన తల్లిగా తన పాత్రను పోషించడంలో ఎక్కడా రాజీపడని మా అమ్మ మా సొంత పాడిగేదెల ద్వారా వచ్చే పాలను నెల్లూరులో అమ్మి, తద్వారా వచ్చే డబ్బుని మా స్కూల్ ఫీజులు కట్టడంతో పాటు మా ఇతర అవసరాలకు వాడేది. అప్పట్లో బాగా ప్రాచుర్యం పొందిన స్వాతి వారపత్రిక అంటే అమ్మకు చాలా ఇష్టం. వారానికి ఒకటిన్నర రూపాయి లెఖ్ఖన నెలకు 6 రూపాయలు ఈ పత్రిక కోసం ఖర్చుపెట్టడం ఎందుకని ఆలోచించి పక్కింట్లో వాళ్ళు చదివే వరకు నిరీక్షించి వారి దగ్గర స్వాతి తెచ్చుకుని చదివి, నెలకు ఆ 6 రూపాయలను గృహావసరాల కోసం పొదుపు చేసేది అమ్మ.

ఆర్థికంగా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, రోజువారీ జీవితంలో ఎన్ని కష్టాలు పడవలసి వచ్చినా ఏనాడూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ఎక్కడా నైతిక విలువలు మరువకుండా తమ గౌరవాన్ని ఏనాడూ తగ్గించుకోకుండా హుందాగా చిరునవ్వుతో తాము జీవిస్తూ తమ చుట్టూ వున్న బంధువులను చేరదీస్తూ, తమ తోటి మిత్రులను ఆపదలో ఆదుకుంటూ తమకున్న చిన్న ప్రపంచంలో ఇవ్వడమే తప్ప తీసుకోవడం తెలియని ఆదర్శమూర్తులుగా ఎదిగారు... ఎదిగే కొద్దీ ఒదిగారు మా "అమ్మా నాన్నలు". దృఢమైన విశ్వాసంతో వేసే ప్రతి అడుగు ఆత్మస్థైర్యంతో వేసి తల పైకెత్తుకుని ఆకాశమే హద్దుగా నక్షత్రాలే లక్ష్యంగా నిగర్వంతో ముందుకు సాగాలని మాకు బోధించేవారు.

"కర్మసిద్ధాంతాన్ని నమ్మాలి, మనం చేసే మంచే మనకి మంచి చేస్తుంది." అని నమ్ముతూ "దేవాలయాలకు విరాళాలను ఇవ్వడంకన్నా అవసరమైన వారిలో దైవత్వాన్ని గుర్తించి" వారిని ఆదుకోవడమే మానవ ధర్మం అని భావిస్తూ, "మరణం నుండి మనల్ని కాపాడుతుందని తెలిసినా అబద్ధం చెప్పకూడదు" అన్న నమ్మకాన్ని పాటిస్తూ, "మానవసేవే మాధవ సేవ" అన్న మాటలను అక్షరాలా ఆచరిస్తూ "ఇతరుల గురించి ఎప్పుడూ చెడుగా మాట్లాడకూడదన్న" నియమాన్ని పాటిస్తూ ఉన్నతమైన సిద్ధాంతాలతో ఆదర్శమూర్తులయ్యారు మాకు జన్మనిచ్చిన మా అమ్మా, నాన్న.

వారిపై ఆధారపడిన వారందరికీ వెనుక మా అమ్మానాన్నలు కొండంత అండగా నిలిచారు. మమ్మల్ని కన్నవారిగా నిత్యం మా అడుగులు గమనిస్తూనే మేం క్రిందపడ్డప్పుడు జాగ్రత్తలు చెప్తూ, మాకు కాలం కలిసిరానప్పుడు ఆత్మస్థైర్యాన్ని, మంచి మార్గాన్ని నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకోమని బోధిస్తూ మా మానసిక ఆందోళనని తమ మంచి మాటలతో తరిమేస్తూ ముందుకు నడిపించిన ఆదర్శమూర్తులు మా అమ్మానాన్న. మేం క్రింద పడ్డప్పుడల్లా ఎలా పైకి లేవాలో చెప్పారు. మళ్లీ పరిగెత్తడం, ముందుకంటే వేగంగా అడుగులు వేయడం నేర్పించారు. మా ప్రతి విజయం మా పెద్దమ్మకీ మా అమ్మానాన్నలకీ, వారు మాకు నేర్పించిన జీవిత విలువలకీ అంకితమిస్తూనే వుంటాం.

**ఆగస్టు 12న వారి 50వ పెళ్ళిరోజు సందర్భంగా మా అమ్మానాన్నలకు ఆరోగ్యకరమైన సంతోషదాయకమైన శుభాకాంక్షలు అందజేస్తూ... ఒక ఉన్నతమైన జీవితాన్ని వారు జీవించారు, ఆదర్శమైన వ్యక్తులుగా ఎంతో మందిని ముందుకు నడిపిస్తున్నారు. వారి జీవితం రేపటితరానికి స్ఫూర్తి కావాలని, భవిష్యత్ తరానికి వారు ఆదర్శం కావాలని కోరుకుంటున్నాం. వారి ఆశీస్సులతో మమ్మల్ని దీవిస్తూ... వారి నీడలో మమ్మల్ని నడిపిస్తూ వారి ప్రేమాభిమానాలని ఎల్లప్పుడూ మాపై కురిపిస్తూ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించి 75వ వసంతం కూడా మా అందరితో ఆనందదాయకంగా జరుపుకోవాలని అభిలషిస్తున్నాం... ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నాం.**

మనోజ్ సాయి నంబూరు (అలయన్స్ గ్రూప్)
లత నంబూరు
నీల్ నంబూరు - దక్ష్ నంబూరు

డా|| సాయి శంకర్ నంబూరు
సారా టేలర్ నంబూరు
కెలబ్ సుందర్ నంబూరు

# 'ప్రభా'తం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రానే వచ్చాయి. ఈ సమావేశాల్లో నిరసనల ఉరుములు భీభత్సంగానే వుంటాయని, అడపాదడపా ఆందోళనల వరద వెల్లువలు కూడా ఉధృతంగానే రావచ్చని ముందునుంచీ రాజకీయవర్గాలు వాతావరణ హెచ్చరికల్లా చెప్తూనే వున్నాయి. జరిగేది వర్షాకాల సమావేశాలే అయినప్పటికీ, గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి రాజకీయ వాతావరణం బాగా వేడిగానే వుంటుందని కూడా రాజకీయనిపుణులు అంచనాలు కట్టారు. ఆ అంచనాలు అక్షరాలా నిజం కావడంతో అధికారపక్షం కంగుతింటోంది. పార్లమెంట్ సమావేశాలు సాఫీగా జరగకపోవడం, సభలో తరచూ ప్రతిష్టంభన ఏర్పడడం, చివరకు సభ వాయిదాల మీద వాయిదాలు పడడం నిత్యకృత్యంగా మారింది. గత నెల 21వ తేదీ నుంచి మొదలైన ఈ వర్షాకాల సమావేశాలు ఇప్పటికి పదకొండు రోజులు జరిగిపోయినప్పటికీ, ఏరోజుకారోజు కొత్త నిరసనల ధ్వనులు, మాటల యుద్ధాలతోనే సమయమంతా గడిచిపోయింది. ఈ వర్షాకాల సమావేశాల్లో ఇప్పటికే సగం రోజులు ఇలాంటి నిరసనలు, ఆందోళనలతోనే గడిచిపోయాయి. లలిత్‌మోడీ వ్యవహారంలో ఆరోపణలొచ్చిన సుష్మాస్వరాజ్, రాజస్థాన్ సిఎం వసుంధరరాజే సింధియా, అదేవిధంగా వ్యాపమ్ కుంభకోణానికి సంబంధించి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌పై చర్యకు పట్టుపడతామని, వారి రాజీనామాలకు మినహా మరి దేనికీ తాము అంగీకరించబోమని కాంగ్రెస్ మొదట్లోనే స్పష్టం చేసింది. దీంతో బిజెపి దిగివచ్చి, ఈ వ్యవహారాలపట్ల చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేసింది. అయితే, చర్యల తర్వాతే చర్చలంటూ కాంగ్రెస్ పట్టుబట్టింది. అందుకు బిజెపి కాదంది. గతంలో విపక్షంలో వున్నప్పుడు బిజెపి పట్టుబట్టినట్లే, ఇప్పుడు కాంగ్రెస్ భీష్మించుకుంటోంది. సభ జరగనిచ్చి, చర్చకు సహకరిస్తే ప్రధాని సందర్భోచితంగా జోక్యం చేసుకుని తమ సమాధానమిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కబురంపినా కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ నిరాకరించడంతో కథ మళ్ళీ మొదటికొచ్చింది. దీంతో, సభ జరిగేలా చూసి, సభలోనే తమ డిమాండ్లేమిటో బయటపెట్టి, చర్చకు తావిచ్చి, ఆ వ్యవహారాల పట్ల తమ ప్రశ్నలతో ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశాన్ని కాంగ్రెస్ కోల్పోయినట్లనిపిస్తోంది. పార్లమెంట్‌ను సజావుగా జరగనివ్వకుండా కాంగ్రెస్ ఆటంకాలు కలిగిస్తోందని బిజెపి తీవ్రంగా ధ్వజమెత్తితే, ప్రతిష్టంభన తొలగించడంలో ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా వుందంటూ కాంగ్రెస్ విరుచుకుపడుతోంది. మోదీ ప్రభుత్వంపై నిప్పులు కురిపించేందుకు సమయం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న కాంగ్రెస్‌కు లలిత్‌మోదీ వ్యవహారం, వ్యాపమ్ కుంభకోణాలు చేతికి చిక్కిన పెద్ద విమర్శనాయుధాలని వేరే చెప్పనక్కర లేదు. ఆ అవకాశాన్ని కాంగ్రెస్ ఎట్టిపరిస్థితుల్లోనూ జారవిడుచుకోదన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే, ఆ వ్యవహారాలకు సంబంధించి ఒక కేంద్రమంత్రిని, ఇద్దరు బిజెపి ముఖ్యమంత్రులను లక్ష్యంగా చేసుకుని మోడీ ప్రభుత్వంపై ఆందోళనకు దిగి, ఆ ఆందోళనలో ప్రతిపక్షాలను సైతం కూడగట్టుకుని నిరసన జ్వాలలను మరింత పెద్దవి చేయాలన్న కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నం ఒకవిధంగా ఇలా సఫలమైందనే చెప్పవచ్చు. గతంలో ఎన్నడూ లేనివిధంగా, పార్లమెంట్ సభలు ఇన్ని రోజులుగా రభసగానే తయారవడం దీనికి నిదర్శనం. అందులోనూ, ఈ రభసతో పాతిక మంది కాంగ్రెస్ సభ్యులను అయిదురోజులపాటు సభ నుంచి సస్పెండ్ చేయడం కూడా సంచలనమే. రాజకీయంగా కాంగ్రెస్‌కు ఇలాంటివన్నీ పరోక్షంగా ప్రయోజనకరం కావచ్చేమో!..అసలు గతంలో, తమపై ఏవైనా ఆరోపణలు వినపడినప్పుడు అద్వానీ వంటి సీనియర్ నాయకులు సైతం వెంటనే రాజీనామాలు చేయడానికి సిద్ధపడడం అందరికీ తెలిసిందే. ఇప్పుడలాంటి సత్సంప్రదాయం బహుశా కనుమరుగైపోయిందేమో అనిపిస్తోంది. తమ పార్టీనేతలపై ఆరోపణలు వచ్చినప్పుడు అధికారపక్షం నేతలు మౌనంగా వుండక స్పష్టమైన వైఖరితో వుండివుంటే ఇప్పుడింత పరిస్థితి వచ్చివుండేది కాదేమోన్న అభిప్రాయాలూ సర్వత్రా వినిపిస్తున్నాయి. ఏదేమైనా, అధికారపక్షమైనా, విపక్షమైనా చివరికి ప్రజలకు జవాబుదారీగా వుండాలనే ప్రజాస్వామిక విధానాన్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అందులోనూ దేశవ్యాప్తంగా వున్న సమస్యలను చర్చించి, ఒక పరిష్కారానికి తేవాల్సిన సభలు, ఇలా రభసగానే మారుతుండడం ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది. అధికార-విపక్షాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుని సమస్యలను చట్టసభల్లో చర్చించుకుని, పొరపాట్లేమైనా వుంటే సరిదిద్దుకుని తగు నిర్ణయాలను తీసుకుంటాయని ప్రజలు భావిస్తుంటారు. అయితే, అందుకు భిన్నంగా ఇప్పుడు జరుగుతుండడంతో ప్రజలు నివ్వెరపోతున్నారు. ఇరుపక్షాలవారు ఎవరికివారు చిత్తానుసారం వ్యూహాలు ప్రతివ్యూహాలు పన్నడానికే ఉన్న పుణ్యకాలం కాస్తా గడచిపోతోందే తప్ప, సభలు మాత్రం సజావుగా జరిగే మార్గం గోచరించడం లేదనేదే అందరి ఆవేదన. సభల నిర్వహణకు కోట్లాది రూపాయల ధనం రోజూ మంచినీళ్లలా ఖర్చయిపోతోంటే, ఇరుపక్షాలవారూ సహకరించుకుని సభలు జరిగేలా చూడాలే తప్ప, ఇలా రచ్చలు రావిళ్ళు చేసుకుంటూ కాలయాపన చేయడం ఎంతమాత్రం సముచితమో వారికే తెలియాలి. చర్చ కంటే రచ్చలే ప్రజల దృష్టిని ఆకట్టుకుంటాయని ఎవరైనా అనుకుంటే అది పొరపాటే. అయినా, అసలు చట్టసభలు వుండేది చర్చల కోసమే తప్ప రచ్చల కోసం కాదన్న విషయం అందరికీ తెలిసిందే. ఏదేమైనప్పటికీ, అసలు విషయం పక్కదారి పట్టకుండా, సుహృద్భావపూరిత వాతావరణంలో అందరూ కలసి చర్చించినప్పుడు ఎంతటి జటిల సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని గుర్తించాలి. కేవలం రాజకీయాల దృష్టితోనే కాక ప్రజల ప్రయోజనాల దృష్టితో కూడా ఆలోచించినప్పుడే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుంది.. తద్వారా ప్రజాస్వామ్యమూ ఫరిడవిల్లుతుంది. ఇది అందరూ ఆలోచించాల్సిన విషయం.

## సభలో రభస



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రభసగా మారుతుండడం ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది. ఇరుపక్షాలవారు ఎవరి చిత్తానుసారం వారు వ్యూహాలు పన్నడానికే ఉన్న పుణ్యకాలం కాస్తా గడచిపోతోందే తప్ప, సభలు మాత్రం సజావుగా జరగడం లేదన్నదే ప్రజల ఆవేదన. సభల నిర్వహణకు కోట్లాది రూపాయల ధనం రోజూ మంచినీళ్లలా ఖర్చయిపోతోంటే, సజావుగా సభల నిర్వహణకు ఇరుపక్షాలవారూ సహకరించుకుని, ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుని, సభలు జరిగేలా చూడాలే తప్ప, ఇలా రచ్చలు రావిళ్ళు చేసుకుంటూ కాలయాపన చేయడం సముచితం కాదు.

# భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ







గురుపూర్ణిమ సందర్భంగా జులై 31న జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో సాయి నామస్మరణ మార్మోగింది. 'ఓంసాయి.. శ్రీసాయి .. జయజయ సాయి'.. అంటూ భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సాయినాథునికి పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారాలతో, విశిష్టమైన పూజలు, అభిషేకాలు, హారతులతో, ఆ దివ్యమూర్తికి ఎంతో వైభవంగా చేసే పల్లకీ సేవలతో సాయినాథుని ఆలయాలు శోభిల్లగా, అఖండ సాయినామ సంకీర్తనలతో, సాయి చరిత్ర పారాయణాలతో భక్తులు తడేక భక్తితో ఆ స్వామిని మనసారా ఆరాధించారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని షిర్డిసాయి మందిరంలో నిర్వాహకులు మన్నెం అమర్‌నాథరెడ్డి, పైడిపాటి సుధాకరరావు, కొల్లి శ్యామ్ సుందర్‌రెడ్డి, దువ్వూరి జయమ్మ, మోహన్ రావు, ఆలయ అర్చకులు తదితరుల పర్యవేక్షణలో గురుపూర్ణిమ ఉత్సవాలు వేడుకగా జరిగాయి. అదేవిధంగా, బాలాజీ నగర్ శివార్లలో వున్న పద్మావతి నగర్ లోని సాయిదర్బార్‌లోని అద్దాల మందిరంలో సాయినాథునికి విశేష పుష్పాలంకరణలు చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో, సత్సంగ్ సేవాదళ్ సభ్యుల సారథ్యంలో స్వామివారికి గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. మందిర వ్యవస్థాపకులు మధుసాయి ఈ వేడుకలను పర్యవేక్షించారు.

నిప్పోసెంటర్‌లోని షిరిడీ సాయిబాబా మందిరంలో సాయినాథునికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. నిప్పో బ్యాటరీస్ ఎం.డి పి.ద్వారకానాథ్‌రెడ్డి, కోటేశ్వరరావు (వెంకటాచలం మండలం), ఎగువమిట్ట సర్పంచ్ రాజేశ్వరి, సునీల్‌కుమార్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. నవలాకులతోటలో వున్న సాయిధర్మక్షేత్రంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. పుచ్చలపల్లి సుధాకర్‌రెడ్డి-శిల్ప, ఒ.వెంకటబాబు-మాధవి, తాటి సుధాకరరెడ్డి-శ్యామల, తాటి పరంధామిరెడ్డి-విజిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మందిరం ఛైర్మెన్ సాయికుమార్ ఈ ఉత్సవాలను పర్యవేక్షించారు.

## 'బ్లాక్ టిక్కెట్ల' భాగోతాన్ని బయటపెట్టారు

'మూడుహాళ్లలో బ్లాక్ టిక్కెట్ల దందా' పేరుతో జూలై 31వ తేదీ సంచికలో వచ్చిన వార్త వాస్తవానికి అద్దం పడుతుంది. నెల్లూరులో వినోదానికి సినిమా తప్ప మరో దారిలేదు. ఆ సినిమా చూడాలన్నా ఎస్2 పేరుతో పిలవబడే మూడుహాళ్ళు తప్ప మరో గత్యంతరం లేదు. ఆదివారాలు, పండుగరోజుల్లో పిల్లలు, బయట ప్రాంతాల నుండి వచ్చిన బంధువులతో సినిమాకు పోవాలనుకుంటే టిక్కెట్లు దొరకవు. గతంలో కృష్ణ, కావేరి, కళ్యాణి హాళ్లు ఉన్నప్పుడు శుభ్రంగా కౌంటర్‌లో టిక్కెట్లు ఇచ్చేవాళ్లు. పది నిముషాలైనా క్యూలో నిలబడి టిక్కెట్లు తీసుకుని సినిమా చూసేవాళ్లం. ఇప్పుడు టిక్కెట్ కౌంటర్లే లేవు. నెట్‌లో టిక్కెట్లు ఎప్పుడూ దొరకవు. అందరికీ సిఫార్సులు చేయించి టిక్కెట్లు తెప్పించుకునే స్థోమత వుండదు. బ్లాక్‌లో టిక్కెట్లు కొని సినిమా చూసే పరిస్థితి వుండదు. 'లాయర్' ఒక చీకటి భాగోతాన్ని బయటపెట్టింది. ఇప్పటికైనా మూడుహాళ్లలో టిక్కెట్ల పద్ధతి మార్చాలి.

కె.శివనారాయణ, నెల్లూరు.

## చెడ్డ ఆవుపాలు

ఒక పాఠశాలలో మేడమ్ గారు చిన్నారులకు తెలుగు పద్యానికి అర్థం చెప్తూ, గంగిగోవు పాలు గరిటడైనను చాలు కడివెడైననేమి చెడ్డ ఆవుపాలు అని చెప్తోంది. పాపం ఆమెకు ఖరము అనే పదానికి అర్థం తెలియదు. అందుకే 'చెడ్డ ఆవు' అని చెప్పింది. అలా ఉంటాయి ప్రైవేటు పాఠశాలల్లో తక్కువ అర్హత కలిగిన ఉపాధ్యాయుల పాఠాలు. అందుకే డిఇఒ ఆంజనేయులు అర్హత లేని ఉపాధ్యాయుల చేత పాఠాలు చెప్పడాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## బొమ్మిరెడ్డి సంబరాలు

జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి జాక్‌పాట్ కొట్టి ఆ పదవిలోకి వచ్చారు. గతంలో ఎమ్మెల్సీగా కూడా జాక్‌పాట్ కొట్టాడు. ఉద్రిక్తతల మధ్య జడ్పీ ఛైర్మెన్ అయ్యాడు. ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం లేదు. స్కూళ్ళు, హాస్టళ్లలో వసతులు గురించి పట్టించుకుంటున్నాడు. ఇంకా ప్రతిఊరికి మంచినీరివ్వాలి. మురికి కాలువలు కట్టించాలి. నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి లాగా పేరు తెచ్చుకోవాలి.

- వాస్తు రామచంద్ర, నెల్లూరు.





## వాళ్లనీ ఉరి తీయాలి

ఉగ్రవాదులనే కాదు, ఉగ్రవాదులకు మద్దతుగా మాట్లాడేవాళ్లను కూడా ఉరితీయాలి. ముంబై బాంబు పేలుళ్లలో వందలమంది చనిపోయారు. కుహనా లౌకికవాదులకు అప్పుడు నోళ్లు పడిపోయాయి. ఆ బాంబు పేలుళ్ల నిందితునికి ఉరిశిక్ష వేస్తుంటే మాత్రం గగ్గోలు పెట్టారు. ఇలాంటి వారివల్లే ఉగ్రవాద పోకడలు పెరుగుతున్నాయి.

సి.రాజీవి, నెల్లూరు.

# తిరుమల గిరిగా సింహపురి

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అతిపెద్ద భక్తి కార్యక్రమం
- 9రోజుల పాటు ఆధ్యాత్మిక క్షేత్రం కానున్న నెల్లూరు నగరం







*కలియుగ దైవం... తిరుమల తిరుపతిలోని సప్తగిరులలో కొలువైన శ్రీ వేంకటేశ్వరుడు. ప్రతి భక్తుడూ తన జీవితంలో ఒక్కసారైనా ఆ దివ్యమంగళ స్వరూపుడిని దర్శించుకోవాలనుకుంటాడు. కాని ఒకసారి దర్శించుకుంటే అక్కడితో సంతృప్తి చెందుతారా... లేదు మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేంత మహిమాన్విత దేవుడు ఆ శ్రీనివాసుడు. శ్రీవారి దర్శనభాగ్యం దొరకడమే అదృష్టంగా భావిస్తుంటారు భక్తులు. ఇక శ్రీవారి సన్నిధిలో నిత్యం జరిగే సేవలలో పాల్గొనే అవకాశం దొరికితే పూర్వజన్మ పుణ్యఫలంగా భావిస్తుంటారు. అయితే శ్రీవారి సన్నిధిలో జరిగే నిత్య సేవలలో పాల్గొనే అవకాశం అందరికీ లభించదు. దేశవిదేశాలలో స్వామికి వందలకోట్ల భక్తులున్నారు. కాని నిత్యసేవలలో వందల సంఖ్యలో మాత్రమే భక్తులను అనుమతిస్తారు. సామాన్యులకు నిత్యసేవల టిక్కెట్లు దొరకడం కూడా కష్టమే!*

అయితే నెల్లూరుజిల్లాలో ఉండే శ్రీవారి భక్తులకు మాత్రం ఈ లోటును తీర్చడానికి ముందుకొచ్చాడు ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఆ వేంకటేశ్వరుడే తన భుజం తట్టి ప్రోత్సహించినట్లుగా నెల్లూరులోని ఏసి స్టేడియంలో 9రోజుల పాటు శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలను నిర్వహించడానికి సంకల్పించాడాయన. ఆయన సంకల్పానికి కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె దీపావెంకట్, టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, కార్య నిర్వహణాధికారి ఎం.సాంబశివరావు ప్రోత్సాహమిచ్చారు. దీంతో ఈ నెల 8వ తేదీ నుండి 16వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగనున్న శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలకు ఏ.సి స్టేడియం ముస్తాబయ్యింది. భారీ మొత్తంలో ఖర్చుయ్యే ఈ వేడుకను విపిఆర్ ఫౌండేషన్ నిర్వహించబోతోంది. ఖర్చు మొత్తం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పెట్టుకుంటున్నాడు. స్టేడియంలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా సెట్టింగ్స్ వేస్తున్నారు. స్వామి వారు కొలువయ్యే వేదికను నమూనా ఆలయంగా మారుస్తున్నారు. నిత్యసేవలు చూసి తరించడానికి దాదాపు 25వేల మంది భక్తులు ఒకేసారి కూర్చునే విధంగా ఏర్పాట్లు చేసారు. భక్తుల కోసం క్యూలైన్లు, ప్రసాదాలు, మంచినీళ్లు... అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. శ్రీవారి చిత్రపటాలు, పుస్తకాలు, భక్తి గీతాల సిడిలు వంటివి లభించే స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. విశాలమైన కారు పార్కింగ్ ఉంది కాబట్టి మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య కూడా లేదు. అత్యంత ఆకర్షణీయంగా ఉండేలా విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. ఇంతకు ముందు విశాఖపట్నం, గుంటూరులలో శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలను నిర్వహించారు. ఎక్కడా లేనంత ఘనంగా నెల్లూ రులో ఏర్పాట్లు జరుగు తున్నాయి.

సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, సహస్ర దీపాలంకరణ సేవ... ఇలా తిరుమలలో ఎన్నో సేవల గురించి వినడమే కాని ఆ సేవలను కళ్ళారా చూసే భాగ్యం భక్తులందరికీ రాదు. కాని నెల్లూరీయులకు మాత్రం ఆ భాగ్యాన్ని కల్పిస్తోంది విపిఆర్ ఫౌండేషన్. 7వతేదీ సాయంత్రం వైభవోత్సవాలకు టిటిడి వేద పండితుల ఆధ్వర్యంలో సంకల్పం జరుగుతుంది. ఆ తర్వాత ప్రముఖ ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావుచే ఆధ్యాత్మిక ప్రవచనాలు, అన్నమాచార్య విద్వాన్‌మణి గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌చే అన్నమాచార్య కీర్తనల విభావరి నిర్వహిస్తారు. ఈ నెల 8 నుండి 16వ తేదీ వరకు ఏసి స్టేడియంలో జరిగే శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలలో పేద, పెద్ద తేడా లేకుండా, కులమతాలకతీతంగా అందరూ పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని తిరుమల తిరుపతి దేవస్థానాల వారు ఆహ్వానిస్తున్నారు.

ఇప్పటికే వేల సంఖ్యలో పోస్టర్లు, కరపత్రాలు జిల్లా అంతా దర్శనమిస్తుండగా, ప్రతి మండల కేంద్రంలో భారీ స్థాయిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలో ట్రంకురోడ్డు పొడవునా మరియు మాగుంట లే అవుట్, ఇతర ప్రాంతాల్లో స్థంభాలకు మైక్ సెట్లను అమర్చి ఈ 9 రోజులూ స్టేడియంలో జరిగే పూజా విశేషాలను, వేద మంత్రాలను నగర ప్రజలు వినే ఏర్పాట్లు చేశారు. తిరుమల నుండి వచ్చిన ప్రచారరథాలు జిల్లా నలుమూలలకు వెళ్ళి ఈ కార్యక్రమానికి ప్రాచుర్యాన్ని కల్పిస్తున్నాయి.

## అంతా ఉచితమే... పాసులుండవ్

9రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఎలాంటి ప్రవేశ పాసులు కూడా అక్కర్లేదు. ఎంతమంది వచ్చినా కనులారా స్వామివారిని దర్శించుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మన జిల్లాకి ఇది మహత్తర అవకాశం. అరుదుగా లభించే గొప్ప అదృష్టం. చిన్న, పెద్ద, పేద, గొప్ప అన్న తేడా లేకుండా కులం, మతం, వర్గం, వర్ణం అన్న బేధం లేకుండా అందరూ స్వామివారిని దర్శించుకుని పునీతులౌదాం. ఓం నమో వేంకటేశాయనమః.

## వ్యయం మొత్తం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిదే - తితిదే

ఈ కార్యక్రమానికి భారీ మొత్తంలో కానున్న ఖర్చంతా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డే భరిస్తున్నట్లు, ఇందుకోసం చందా లేదా విరాళాల రూపంలో డబ్బులు ఇవ్వడానికి ఎంతమంది ముందుకు వచ్చినా ప్రభాకర్‌రెడ్డి సున్నితంగా తిరస్కరిస్తున్నారని, విరాళాల రూపంలోగాని చందా రూపంలోగాని ఎవ్వరూ డబ్బు చెల్లించాల్సిన అవసరమే లేదని, స్వామివారికి ఒక మొక్కులాగా ఈ మహత్తర కార్యక్రమాన్ని మొత్తం తానే నిర్వహించడానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముందుకు వచ్చారని తిరుమల తిరుపతి దేవస్థానాల అధికారులు చెప్పారు.

# జిల్లాలోనూ ర్యాగింగ్ రాక్షసి

ప్రతి మనిషికి మనసుంటుంది. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం ఉంటాయి. మనిషి కోట్లాది రూపాయలు నష్టపోయినా తట్టుకుని నిలబడగలడు గాని, ఆత్మగౌరవం దెబ్బతింటే మాత్రం సహించలేడు. ఆత్మాభిమానం దెబ్బతినడం, ఆత్మస్థైర్యం కోల్పోవడం వంటి పరిస్థితుల్లోనే ఏ మనిషయినా ఆత్మహత్యకు పాల్పడుతుంటాడు. మనం చందమామ కథల్లో చాలామంది రాక్షసుల గురించి చదివుంటాం... మనుషులను పీక్కుతింటారని. అలాంటి రాక్షసులు ఉండేవారో లేదో మనకు తెలియదు. కాని ఇప్పుడు ఆ రాక్షసగణాలు కంటికి కనిపించని విషసంస్కృతుల రూపంలో జనాన్ని చంపుతున్నాయి.

ఈ విషసంస్కృతి రాక్షసి పేరే ర్యాగింగ్. ఆత్మాభిమానానికి ప్రధానశత్రువు. మన సంస్కృతిలో పాతకాలం నుండి కూడా సరదాగా ఆటపట్టించే పద్ధతి వుంది. ఇది సరదాగానే ఉంటుంది. అయితే ఎక్కడనుండి ఊడిపడిందోగాని మన సాంప్రదాయ సరదా వేడుకలో ర్యాగింగ్ రాక్షసి చొరబడింది. ఈ ర్యాగింగ్ ఒక రాక్షస క్రీడ. విష సంస్కృతి. ముఖ్యంగా భావిభారత పౌరులను తీర్చిదిద్దాల్సిన విద్యాలయాల్లో ఇది తిష్ట వేసుకుని కూర్చొని ఎందరో విద్యార్థుల బ్రతుకులను బుగ్గిపాలు చేస్తోంది. కాలేజీలలో కొత్తగా చేరిన జూనియర్ విద్యార్థుల పట్ల సీనియర్ విద్యార్థులు ఎంతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలి. వారితో ఎంతో చనువుగా వుంటూ జూనియర్లలో ఉన్న భయాందోళనలు తొలగించాలి. చదువులలో సందేహాలను నివృత్తి చేస్తూ సోదరుల్లా వ్యవహరించాలి. కలివిడితనం కోసం ఆటలు, పాటలు, సరదాగా జోక్‌లు, ఆరోగ్యకరమైన సన్నివేశాలు... ఇంతవరకు చేసుకోవచ్చు. కాని ఇప్పుడు ర్యాగింగ్ చేయడమంటే ఒక విద్యార్థి ఆత్మాభిమానాన్ని నిలువునా హత్య చేయడమే. ర్యాగింగ్‌కు గురైన వారు చెప్పుకోలేనంత అసహ్యంగా ఉంటుంది. ర్యాగింగ్ రాక్షసత్వానికి గత కొన్ని దశాబ్దాల కాలంలో ఎందరో విద్యార్థులు బలైపోయారు. ఇంకా బలవుతూనే వున్నారు. ఇటీవల గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో రిషితేశ్వరి సంఘటన సంచలనం కావడం తెలిసిందే! నెల్లూరుజిల్లాలోని పలు ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్ కాలేజీలలోనూ ఈ ర్యాగింగ్ ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. గతంలో విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్, కావలిలోని జవహర్‌భారతి కళాశాలల్లో, పలు ఇంజనీరింగ్ కాలేజీలకు కూడా ఈ విషసంస్కృతి పాకినట్లుగా తెలుస్తోంది. ఇంతకుముందు ప్రతి విద్యాసంవత్సరం ఆరంభంలో అన్ని ఇంజనీరింగ్ కాలేజీలలోనూ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించేవారు. పోలీసు ఉన్నతాధికారులు పాల్గొని ర్యాగింగ్ నష్టాలు, చట్టాలు, శిక్షలు గురించి చెప్పేవాళ్లు. కొందరన్నా బుర్రకెక్కించుకుని భయంగా వుండేవాళ్లు. ముఖ్యంగా కాలేజీ యాజమాన్యాలు కూడా ర్యాగింగ్‌ను నిరోధించడానికి కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. కాలేజీ యాజమాన్యాలు, పోలీసులు కఠినంగా వుంటే ఈ ర్యాగింగ్ రాక్షసిని తరిమికొట్టడం పెద్దసమస్య కాదు.


తృతీయ వర్థంతి



స్వర్గీయ బద్వేలు గోపాల్ రెడ్డి గారు
జననం : 1940 మరణం :12-8-2012

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మా ఇంటి దైవం
శ్రీ బద్వేలు గోపాల్ రెడ్డి గారి
తృతీయ వర్థంతి తేది 12-8-2015 బుధవారం సందర్భంగా
వారిని స్మరించుకుంటూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య : బద్వేలు సుజాతమ్మ

కుమారుడు - కోడలు
బద్వేలు సుబ్బారెడ్డి - జ్యోతి
మనుమరాలు - సోహిని

కుమార్తె - అల్లుడు
మంజుల - తిక్కవరపు జనార్ధన్‌రెడ్డి
మనుమడు - వంశీరామ్ - శృతి

మరియు కుటుంబసభ్యులు


VAMSIRAM BUILDERS, Hyderabad.

# 3 అంతర్జాతీయ సదస్సులకు డాక్టర్ జగదీష్



ప్రముఖ శాస్త్రవేత్త, నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ డైరెక్టర్, ప్రముఖ అంతర్జాతీయ ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నిపుణుడు డాక్టర్ ఎ.జగదీష్‌కు ఎంతో విశేషంగా 3 అంతర్జాతీయ సదస్సులకు ఆహ్వానం అందింది. ఈ ఏడాది అక్టోబర్ 11 నుంచి 14వ తేదీ వరకు ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగే 6వ ప్రపంచ హైడ్రోజన్ టెక్నాలజీ సదస్సులో పాల్గొనేందుకు ఆయనకు ఆహ్వానం అందింది. అదేవిధంగా, ఈ ఏడాది నవంబర్ 22 నుంచి 25వ తేదీ వరకు ఇటలీలోని పలేర్మోలో జరిగే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ సదస్సుకు ఆ తర్వాత డిసెంబర్ 11 నుంచి 14వ తేదీ వరకు శ్రీలంకలోని కాన్డీలో జరిగే సదస్సుకు ఆయనను ఆహ్వానించారు. ఒకే ఏడాది మూడు అంతర్జాతీయ సదస్సులకు నెల్లూరుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జగదీష్‌కు ఆహ్వానాలు అందడం జిల్లాకే గర్వకారణం. కాగా, డాక్టర్ జగదీష్ ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, వాతావరణం, అప్రాప్రియేట్ టెక్నాలజీలపై శాస్త్రవేత్తగా విశేష సేవలందిస్తున్నారు. ఇప్పటిదాకా దాదాపు 140 అంతర్జాతీయ, జాతీయ వైజ్ఞానిక పత్రికల్లో వివిధ అంశాలపై ఆయన రచించిన రచనలు ముద్రితమయ్యాయి. 40 దేశాలలో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో డాక్టర్ జగదీష్ పాల్గొనడమే కాక, 15 అంతర్జాతీయ, జాతీయ అవార్డులను కూడా సాధించి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో జిల్లా కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా ద్విగుణీకృతం చేస్తున్నారు. శాస్త్రవేత్తగా రాణిస్తూ, అంతర్జాతీయస్థాయిలో తన ప్రతిభను చాటుతోన్న డాక్టర్ జగదీష్‌కు 'లాయర్' అభినందనలు.

## కొనాలంటే కన్నీళ్లు!



ఎర్రగడ్డలను ఇంతకుముందు కోస్తే కన్నీళ్లొచ్చేవి. కాని ఇప్పుడు కొనాలన్నా కన్నీళ్లు వస్తున్నాయి. కిలో ఉల్లిపాయలు 50రూపాయలు పలుకుతున్నాయి. వీటికి పెరుగుతున్న డిమాండ్‌ను చూసి కొందరు వ్యాపారులు గోడౌన్‌లలో పెద్ద ఎత్తున స్టాక్ వుంచి, రేట్లు పెరిగాక అమ్ముతున్నారు. కూరగాయల మార్కెట్‌లో నాణ్యమైన ఉల్లిపాయలు ఒక రేటు, నాణ్యత లేని ఉల్లిపాయలు ఒక రేటుకు అమ్ముతున్నారు. రైతుబజార్లలో ప్రభుత్వం కిలో ఉల్లిపాయలను 20రూపాయలకే అమ్ముతున్నా అవి అందరికీ దొరకడం లేదు. ఉల్లిపాయల ధరలు చూసి గృహిణులు ఇళ్లల్లో వీటిని పొదుపుగా వాడుకుంటున్నారు. ఉల్లిపాయదోశె, ఉల్లిపాయకారం, ఉల్లిపాయ బజ్జీ, ఉల్లిపాయ పకోడ వంటివి పూర్తిగా కట్‌చేశారు. గిట్టుబాటు కావడం లేదని కొన్ని హోటల్స్‌లో కూడా ఉల్లిపాయ దోశె, ఉల్లిపాయ పకోడీలను ఆపేసారు.

## యాంటి ర్యాగింగ్ కమిటీలు

కళాశాలల్లో యాంటి ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని వైకాపా విద్యార్థి విభాగం నాయకులు జిల్లా ఎస్పీ గజరావు భూపాల్‌ను కోరారు. ఈ నెల 1వ తేదీ వైయస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జి.పి.శ్రావణ్ మాట్లాడుతూ పలు కళాశాలల్లో యాజమాన్యాలు, అధ్యాపకుల నిర్లక్ష్యం కారణంగా ర్యాగింగ్ భూతం కోరలు చాస్తోందన్నారు. రిషితేశ్వరి విషాదాంతాన్ని మర్చిపోక ముందే నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతూ ర్యాగింగ్ భూతానికి బలైన మధువర్ధన్‌రెడ్డి ఉదంతమే దీనికి నిదర్శనమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరికృష్ణయాదవ్, అమర శివకుమార్, నిఖిల్, చరణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి

--- 'రాక్ ద రోడ్' ప్రోగ్రాంలో ఎస్పై ప్రసాదరెడ్డి ---



చిన్నారులు ట్రాఫిక్ రూల్స్‌పై చిన్న వయసు నుండే అవగాహన పెంచుకోవాలని నాల్గవ నగర ఎస్పై ప్రసాద్‌రెడ్డి సూచించారు. గత నెల 31వ తేదీ నెల్లూరు సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లేక్లాసు, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులచే 'రాక్ ద రోడ్' ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పై ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎడమవైపు వెళ్లాలని, అతివేగంగా ప్రయాణించరాదని సూచించారు. స్కూలు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు బస్సు ఆగిన తర్వాత ఎక్కడం, దిగడం చేయాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. చిన్నారులకు ఇలాంటి చక్కని ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేసిన ప్రిన్సిపల్, అధ్యాపకబృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, కిడ్స్ ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ లక్ష్మి, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, అధ్యాపకబృందం, చిన్నారులు పాల్గొన్నారు.

## ఆదాయం అదిరింది

నెల్లూరుజిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని రాబట్టింది. ఆగష్టు 1 నుంచి భూవిలువలు పెంపుతో జూలైలోనే లక్ష్యానికి మించి ఆదాయం రావడం విశేషం. జిల్లాలో నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ పరిధి క్రింద 9సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా ప్రభుత్వం జూలై మాసానికి సంబంధించి రూ.11.29కోట్లు టార్గెట్‌ను విధించగా రూ.13.15కోట్లు రాబట్టింది. గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ పరిధి క్రింద 10సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా రూ.7.7కోట్లు టార్గెట్‌ను విధించగా రూ.10కోట్లు దాటింది.

## డిఎఫ్ఓకు స్థాన చలనం

జిల్లా అటవీశాఖాధికారిగా వున్న శ్రీకంఠనాథరెడ్డిని హైదరాబాద్‌లోని అటవీ విద్యా విభాగానికి డైరెక్టర్‌గా బదిలీ చేసింది ప్రభుత్వం. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఆయన డిఎఫ్ఓగా వచ్చారు. ఎలాంటి ఆరోపణలు లేవు. అటవీశాఖ కార్యాలయంలో మార్పులు తీసుకొచ్చారు. సిబ్బంది చేత బాగా పనిచేయించారు. ప్రభుత్వం గట్టిగా నాలుగు నెలలు కూడా పనిచేయనీయకుండానే ఇక్కడ నుండి హైదరాబాద్‌కు పంపింది.

## వృత్తి విద్యాశాఖాధికారిగా వెంకయ్య

కోవూరు మండలం ఇనమడుగు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బీనా వెంకయ్యను జిల్లా వృత్తివిద్యాశాఖాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ఈ పోస్ట్‌లో వున్న బాబూ జాకబ్‌ను ఆర్ఐఓగా నియమించడం తెలిసిందే! ఆయన స్థానంలోకి వెంకయ్య వచ్చారు. వెంకయ్య 23ఏళ్ల పాటూ లెక్చరర్‌గా పనిచేసారు. 2009 నుండి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఇప్పుడు జిల్లా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

## వెంకటేశ్వరలో సీట్లు ఫుల్

2015-16 విద్యాసంవత్సరానికి సంబంధించి నెల్లూరుజిల్లా కొడవలూరులోని శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఇంజనీరింగ్ కోర్సుల్లోను, డిప్లమో కోర్సుల్లోను నూరుశాతం సీట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కాలేజ్ ఛైర్మెన్ విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నెల్లూరు కబుర్లు



## రామ్‌నగర్ రిజిస్ట్రేషన్ రద్దు మా కృషే!

నెల్లూరు రామ్‌నగర్‌లోని ముస్లింల శ్మశాన వాటిక స్థలం రిజిస్ట్రేషన్ రద్దు తమ పోరాట ఫలితమేనని పిసిసి ఉపాధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. 3వ తేదీ ఆయన ఏసి సెంటర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టారు. ముస్లింలతో కలిసి మేం ఈ స్థలాన్ని కాపాడేందుకు అలుపెరుగని పోరాటం చేశాం. కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని అక్రమార్కుల చెర నుండి విడిపించాం. ప్రైవేట్ వ్యక్తుల పేరుతో వున్న ఈ స్థలం రిజిస్ట్రేషన్‌ను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థలం మళ్ళీ ముస్లింల కబరస్థాన్‌కు దక్కింది. నగరంలో ముగ్గురు మాయలమరాఠీలు ఈ స్థలాన్ని ముక్కలు చేసి కాజేయాలనుకున్నారు. ఇక్కడ భవన నిర్మాణాలకు 15రోజుల్లో అనుమతులిచ్చారు. శ్మశాన స్థలం ఆక్రమించారని, అనుమతులు రద్దు చేయాలని జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను కూడా మూడునెలలు తొక్కిపెట్టేసారు. మేం ముస్లింలతో కలిసి ఆందోళనకు దిగాకే, ఇక చేసేదేమీ లేక ఆక్రమణకు సహకరించిన నాయకులు ప్లేటు ఫిరాయించారని వివేకా ఆరోపించారు.

## ఉత్త మాటలే... పనులేవీ!

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగి సంవత్సరం దాటినా ఒక్క పని కూడా చేయలేదని డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ విమర్శించారు. ఈ నెల 1వ తేదీ ఆయన ఆరవ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరులోని 54డివిజన్లను అభివృద్ధి చేస్తామని చెప్పిన పాలకులు వాటిని విస్మరించారని మండిపడ్డారు. డివిజన్లో దాదాపు రూ.25లక్షల పనులకు ప్రతిపాదనలు ఉన్నా ఏ ఒక్కటీ జరగడం లేదని విమర్శించారు. తన సొంత నిధులు దాదాపు రూ.10లక్షలతో డివిజన్లో ఇప్పటివరకు లైట్లు, పంట కాలువ పూడికతీత, కల్వర్టు, మినరల్ వాటర్‌ప్లాంటు తదితర వాటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మం, శ్రీధర్, సత్య, తులశీరామ్, ఆదినారాయణ, అనిల్, బాలరాజు, మాలకొండయ్య, మస్తాన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్‌కు ఉచిత వైద్యపరీక్షలు



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో ఈ నెల 1వ తేదీ ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస కుమార్, బి.శేషగిరిరావు ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 300మందికి బిపి, షుగర్ పరీక్షలను డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ దొరస్వామినాయుడు నిర్వహించారు. అసోసియేషన్ కోశాధికారి నారాయణరావు, సభ్యులు రాఘవేంద్రశెట్టి, సురేష్‌కుమార్, అమరేంద్రరెడ్డి, దద్దోలు రమణయ్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్‌డే



ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా ఆదివారం నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధులు, బాలల ఆశ్రమంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. వాసవి క్లబ్ అధ్యక్షులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు ఆశ్రమంలోని పిల్లలకు, వృద్ధులకు అల్పాహారం అందజేసి, దుప్పట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎన్.రమేష్, కార్యదర్శి జగన్, సాయిచైతన్య, ఆశ్రమ వ్యవస్థాపకులు తమ్మినేని పొండు, సరళ పాల్గొన్నారు.

# అమెరికా ప్రొఫెసర్‌కు నాయుడమ్మ అవార్డ్



ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ నాయుడమ్మ పేరుతో నెల్లూరులో నెలకొల్పిన నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ప్రతి ఏటా ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక నాయుడమ్మ అవార్డు-2015ను ఈ ఏడాది అమెరికాలోని కార్నెగిమెల్లాన్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ రామయ్యకృష్ణన్‌కు ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ డా. ఎ.జగదీష్ తెలిపారు.

డాక్టర్ రామయ్యకృష్ణన్ ప్రతిష్ఠాత్మకమైన యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్, ఆస్టిన్ నుంచి మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో పిహెచ్‌డి పొందారని, జనరల్ మోటార్స్ డిస్టెన్స్ టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డుతో పాటు, ఆయన 23 ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను కూడా అందుకుని వున్నారని డాక్టర్ జగదీష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాక, అంతర్జాతీయ వైజ్ఞానిక పత్రికలు, వైజ్ఞానిక సదస్సుల్లో నూరుకు పైగానే ఆయన పరిశోధనాపత్రాలను సమర్పించారని, ప్రపంచవ్యాప్తంగా 50 కమిటీలలో డాక్టర్ రామయ్యకృష్ణన్ సభ్యులుగా వున్నారని, 15 వైజ్ఞానిక పత్రికలకు సహ సంపాదకునిగా వున్నారని పేర్కొన్నారు. డిసెంబర్ 21వ తేదీన చెన్నైలోని ఐఐటిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నాయుడమ్మ 21వ స్మారకోపన్యాసం చేసిన అనంతరం, డాక్టర్ నాయుడమ్మ అవార్డును డాక్టర్ రామయ్యకృష్ణన్ అందుకుంటారని ఆయన వివరించారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన నాయుడమ్మ అవార్డును పలువురు విశిష్టమైన వ్యక్తులు అందుకుని వున్నారు. వారిలో డాక్టర్ కె.కస్తూరిరంగన్, డాక్టర్ ద్రోణంరాజు కృష్ణారావు, డాక్టర్ పి.రామారావ్, డాక్టర్ పి.రామచంద్ర రావ్, డాక్టర్ ఆర్.నటరాజన్, డాక్టర్ కిరిక్ ఫారిక్, డాక్టర్ వి.ఎస్ రామమూర్తి, డాక్టర్ అనిల్ కకోడ్కర్, ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా, డాక్టర్ సమీర్ బ్రహ్మాచారి, డాక్టర్ ఎస్. అయ్యప్పన్, డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, ఎస్.రామాదొరై, నందన్ నిలేకని, వి.రాజన్నలతో పాటు, అంతర్జాతీయంగా ప్రముఖులైన డాక్టర్ బెర్నార్డ్ అమెదై (అమెరికా), డాక్టర్ గౌత్ జాస్మన్ (కౌలాలంపూర్), ప్రొఫెసర్ నెజాత్ వెజిరోగ్లులతో పాటు ఐక్యరాజ్య సమితి అండర్ సెక్రటరీ జనరల్ డా.కాన్డే యెమ్‌కుల్లా వుండడం ఎంతో విశేషం.

# విమర్శలకు వెన్ను చూపని వీరుడిని!



విపక్షాల విమర్శలు, గిట్టని వారి ఆరోపణలు తనను ఏమీ చేయలేవని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుల తాటాకు చప్పుళ్లకు నేను బెదరను. నాకు మాటలు తక్కువ. చేతలు ఎక్కువ. అభివృద్ధి అంటే ఏంటో, ఎలా ఉండాలో, ఎలా చేయాలో జిల్లాలో వున్న అందరికీ చూపిస్తానని, అభివృద్ధే అజెండా, ఆశయంగా, ఆరో ప్రాణంగా కృషి చేస్తానని ఆయన చెప్పుకొచ్చారు. ప్రభుత్వ జాబితాలో లేకపోయినా నెల్లూరును స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. భూగర్భ డ్రైనేజీ, తాగునీటికి నగరానికి ఇప్పటికే వెయ్యికోట్లు మంజూరు చేయించాం. నగరంలో ఆక్రమణలు తొలగించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. రానున్న నాలుగేళ్లలో జిల్లాలో మరో నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేందుకు ప్రణాళిక సిద్ధమైంది. సంగం, నెల్లూరు బ్యారేజీలు, కావలి కాలువ, తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్స్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు అటవీశాఖ అనుమతులు కూడా తీసుకోవడం జరిగింది. 300కోట్లతో ఈ పనులను చకచకా పూర్తి చేయనున్నాం. సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణానికి 600కోట్లు మంజూరవగా, తొలి దశలో 100కోట్లతో పనులు జరుగుతున్నాయి. వెలుగొండ ప్రాజెక్ట్ నుండి ఉదయగిరి నియోజకవర్గానికి 10టిఎంసీల నీళ్లిప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఈ సమావేశంలో తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, అనూరాధ, నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు మంత్రి వెంట వున్నారు.

# జెండా పండుగ బాగా చేద్దాం!

**జిల్లా కలెక్టర్ ఎం.జానకి**



ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను బ్రహ్మాండంగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.జానకి ఆదేశించారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో జెండా పండుగ ఏర్పాట్లపై ఆమె అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ పతాకావిష్కరణ, మార్చ్‌ఫాస్ట్, షామియానాలు, సీటింగ్, ఆహ్వానాలు, శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించారు. రొటీన్ కార్యక్రమాలనే కాకుండా నెల్లూరుజిల్లా చరిత్రను చాటేలా తిక్కన, పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను స్మరించుకునేలా కూడా సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించాలని ఆమె సూచించారు. పోలీసు గ్రౌండ్‌లో 'స్వచ్ఛభారత్'ను పాటించాలని, చెత్తా చెదారం గ్రౌండ్‌లో వేయకుండా చూడాలని ఆమె ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డి, డిఇఓ ఆంజనేయులు, సిపిఓ వెంకయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిడి ప్రసాద్‌రావు, వ్యవసాయ శాఖ జెడి వేణుకృష్ణ, డిఎస్ఓ ధర్మారెడ్డి, ఐటిడిఏ పి.ఓ వై.వెంకటేశ్వర్లు, రాజీవ్‌విద్యా మిషన్ పి.ఓ కోదండ రామిరెడ్డి, బి.సి. కార్పొరేషన్ ఇడి కోటేశ్వరరావు, డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

• హమ్మయ్య

# నా మొహాన మట్టిపోశారు...!

## మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్ ఆనందం



నా పూర్వ పరిస్థితి



నా ప్రస్తుత స్థితి

నా పేరు మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్. గత 10 సంవత్సరాల కాలంలో నేను వూహించని స్థాయిలో నా విలువ పెరిగిపోయింది. ముఖ్యంగా 2006 సంవత్సరం నుండి నాకు కళ రావడం మొదలై అది రోజురోజుకీ పెరిగి బెంగుళూరులోని బ్రిగేడ్ రోడ్డుతో పోల్చి నన్ను పిలవడం మొదలుపెట్టారు.

నా పరిధిలోకి "మోర్" సూపర్ మార్కెట్టొచ్చింది, 'లాయర్' పత్రిక ఆఫీసొచ్చింది, బెజవాడ గోపాలరెడ్డి విగ్రహమొచ్చింది, సెలబ్రేషన్ హోటళ్ళొచ్చాయి, కెనరా బ్యాంకొచ్చింది, మురళీకృష్ణ వారి నిర్వాణ పెట్టారు, యల్.జి. వారి షోరూం వచ్చింది, మల్లి హెయిర్ స్టైల్స్, జావెద్ హబీబ్, కాఫీడే, అమిగోస్ వంటివెన్నో ఇక్కడ చేరాయి. అయితే నా పరిస్థితి మాత్రం అధ్వాన్నం అయిపోయింది. భారత రాష్ట్రపతి వచ్చినా, ప్రధానమంత్రొచ్చినా, ముఖ్యమంత్రి వచ్చినా, రాష్ట్ర మంత్రులొచ్చినా ఎవరొచ్చినా పోలీసు మైదానంలో హెలికాప్టర్ దిగితే నా మీద నుండి వెళ్లాల్సిందే!

అందరూ ఇంతగా వాడుకుంటున్న నన్ను గత రెండేళ్ళుగా పట్టించుకోవడం మానేశారు. నా శరీరమంతా గాయాలమయమై కుళ్ళిన పరిస్థితికి వచ్చింది. నా ప్రక్కనే వున్న కింగ్స్‌కోర్ట్ రోడ్డుకి కొత్త అందాలు రావడంతో అందవికారంగా వున్న నన్ను వదిలేసి అందరూ ఆ రోడ్డువైపు దారి మళ్ళించుకున్నారు.

నెల్లూరు రూరల్ యం.యల్.ఏ ఓ నెలరోజుల క్రితం నన్ను పరామర్శించడానికి వచ్చాడు, సంతోషమేసింది. నాకు మోక్షం వచ్చిందనుకున్నాను, కానీ నా ఆశ ఫలించలేదు. మళ్ళీ బీజేపీ నాయకుడు సురేష్‌రెడ్డి వచ్చాడు, నన్ను ఫోటోలు తీసి ఫేస్‌బుక్‌లో పెట్టాడు, నాకు వైద్యం చేయకుంటే ఉద్యమం చేస్తానన్నాడు, అన్నీ వుత్త మాటలే. వారం నాడు శ్రీధర్‌రెడ్డి మళ్ళీ వచ్చాడు, మునిసిపల్ అధికారులను గదమాయించాడు, కానీ చలనం లేదు. చివరికి మొన్న 3వ తేదీ ఉదయం అజీజ్ భాయ్ మందీమార్భలంతో వచ్చాడు. నాకు మంచి వైద్యం అందిస్తానని వాగ్దానం చేసి వెళ్ళిపోయాడు. అదేరోజు సాయంత్రం మునిసిపల్ ఆఫీసుకెళ్ళిన శ్రీధర్‌రెడ్డి మేం నెలరోజులుగా చెప్తుంటే మీకు వినపడడం లేదు అంటూ మునిసిపల్ కమిషనర్‌ని నిలదీశాడు. ఇవ్వాళ రాత్రికే బాగుచేయాలని హుకుం జారీ చేసి హామీ తీసుకున్నాడు.

మొత్తానికి మొన్న 4వ తేదీ మంగళవారం నా చితికిన బ్రతుక్కి అతుకువేసి నా మొహాన అంత మట్టి పోశారు. అదేలేండి వెట్‌మిక్స్ వేశారు. ఇక మళ్ళీ నాకు కొత్త జీవితం ఎప్పుడు ప్రసాదిస్తారో వేచి చూడాల్సిందే...!

• ప్రభుత్వానికి పక్షవాతం

# ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై పక్షపాతం



రాష్ట్ర అసెంబ్లీ ఏర్పడి 14నెలలు దాటినా ఇప్పటికి ఎమ్మెల్యే గ్రాంటు క్రింద ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం విచారకరమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాళెం, బుజబుజనెల్లూరు ప్రాంతాల్లో అధ్వాన్నంగా వున్న ముస్లిం, హిందూ శ్మశానవాటికను స్వయంగా పరిశీలించి, చింతారెడ్డిపాళెం గ్రామంలో స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రాంటు కోసం ఎదురుచూస్తున్న ప్రజాప్రతినిధులకు విజయవాడలో ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలు బాధ కలిగిస్తున్నాయన్నారు. వచ్చే నెల నుంచి ఎమ్మెల్యే గ్రాంటులు విడుదల చేస్తామని, వైకాపా ఎమ్మెల్యేలు ఉన్న చోట ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మెన్‌లు ఎమ్మెల్యే గ్రాంటు వ్యవహారాలు పర్యవేక్షిస్తారని ముఖ్యమంత్రి చెప్పడం వీరి స్థాయికి గౌరవప్రదం కాదన్నారు. వైకాపా ఎమ్మెల్యేల పట్ల వివక్ష చూపుతూ ఇప్పటికే అధికార యంత్రాంగం అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని, ఇప్పుడు ఎమ్మెల్యే గ్రాంటు కూడా వైకాపా ఎమ్మెల్యేలకు ఇవ్వకూడదని చెప్పడం ఎంతవరకు న్యాయమో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. చట్టబద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తూ, ప్రజల్లో ప్రభుత్వం చులకన కావడం తప్ప మరొకటి కాదన్నారు. వైకాపా ఎమ్మెల్యేల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాషా, సతీష్ యాదవ్, జమున, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్‌లకు భలే గిరాకీ..!

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణాలు ధరించాలనే నిబంధన వ్యాపారులకు మంచి వరంగా మారింది. ఈ నిబంధన అమలులోకి రావడంతో, హెల్మెట్ల దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోతున్నాయి.

ఇదే అదనుగా, హెల్మెట్ల ధరలను అమ్మకందార్లు పెంచేస్తున్నారు. అయినా, తప్పనిసరై కొనుగోలుదారులు అంతంత ధర పెట్టి కూడా హెల్మెట్లను కొనుగోలు చేసుకుంటున్నారు. గత వారం రూ.3వందల నుంచి 1300దాకా వున్న హెల్మెట్ల ధర ఒక్కసారిగా ఆకాశంలోకి వెళ్ళిపోయి, తాజాగా 500 నుంచి 2వేల రూపాయల దాకా పెరిగిపోవడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోయారు. హెల్మెట్లు ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపితే జరిమానా తప్పదు కనుక, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధర ఎంతైనప్పటికీ జరిమానాకు భయపడి హెల్మెట్లు కొనుగోలు చేయక తప్పడం లేదు. అయితే ఆగష్టు 1 నుండే అని హడావిడి చేసిన ప్రభుత్వం మళ్ళీ గడువుని నవంబర్ 1 వరకూ పెంచడం కొసమెరుపు.

# కలాంకు కవితా నివాళి




మాజీ రాష్ట్రపతి, మహోన్నత శాస్త్రవేత్త, మహామానవీయమూర్తి, భారత రత్న డా. ఎపిజె అబ్దుల్‌కలాంకు నెల్లూరు కవులు కవిత నివాళులర్పించారు. ఆ మహనీయ మూర్తి భారతావనికి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకుని, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. నెల్లూరులోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో, ఆ సంఘం అధ్యక్షులు ప్రముఖ కవి చిన్ని నారాయణ రావు నేతృత్వంలో టివిఎస్ కళ్యాణ్‌సదన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీకవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ మాట్లాడుతూ, మన తండ్రులు గాంధీగారి తరంలో తాము పుట్టామని సంతోషంగా చెప్పుకుంటుంటారని, ఇప్పుడు మనం విఖ్యాత శాస్త్రవేత్త, మహనీయుడైన అబ్దుల్‌కలాం తరంలో పుట్టామని చెప్పుకోవడానికి గర్విస్తున్నామని అన్నారు. భారతావని ముద్దుబిడ్డగా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహోన్నతమైన శాస్త్రవేత్తగా అబ్దుల్‌కలాం సేవలు భరతజాతి అంతటికీ గర్వకారణమన్నారు. అబ్దుల్ కలాం జీవితచరిత్రను పాఠ్యాంశంగా చేర్చి, భావితరాలవారికి మరింత స్ఫూర్తిని అందించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం, పలువురు కవులు కవితాగానం చేసి, తమ కవితలతో అబ్దుల్ కలాంకు కవితానివాళి అర్పించారు. డా.కాళిదాసు పురుషోత్తం, సోమిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆచార్య ఆదిత్య, బివి నరసింహం, మెట్టు రామచంద్రప్రసాద్, లతీఫ్‌కుట్టి, డాక్టర్ ఈదూరు సుధాకర్, ఆలూరి శిరోమణిశర్మ, ఈతకోట సుబ్బారావు, ఏటూరి నాగేంద్ర, దగ్గుమాటి పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత, అబ్దుల్‌కలాం చిత్రపటానికి పలువురు కవులు, ప్రముఖులందరూ పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# సాహిత్య వైభవాన్ని చాటిన దువ్వూరు



తెలుగు సాహిత్య వైభవాన్ని దువ్వూరు రామిరెడ్డి రచనలు చాటిచెప్పాయని కడప యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం టౌన్‌హాల్లో దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో కవికోకిల దువ్వూరు రామిరెడ్డి 119వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా "కవికోకిల – సాహిత్య విమర్శ వ్యాసాలు" అనే అంశంపై చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య ఉపన్యాసకులుగా ప్రసంగిస్తూ 20వ శతాబ్దపు సాహితీ విమర్శకుల్లో దువ్వూరు రామిరెడ్డి ప్రముఖులన్నారు. సాహిత్య విమర్శల్లో సైతం ఆయన తనదైన శైలిలో వ్యాసాలను వెలువరించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దువ్వూరు రామిరెడ్డి కవికోకిలగా సాహిత్య ప్రపంచంలో సింహపురి ఖ్యాతిని మరింతగా పెంచారన్నారు. ఈ సందర్భంగా రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిని, విఠపు బాలసుబ్రహ్మణ్యంని నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి కార్యదర్శి, ద్విసహస్ర సభాసింహం బి.వి.నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కడప డిప్యూటీ లేబర్ కమిషనర్ రాచపాళెం రఘు, దువ్వూరు సాహిత్య వైభవాన్ని గురించి వివరించారు. సభా కార్యక్రమానికి ముందు సుప్రసిద్ధ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు జె.బాలార్క శిష్య బృందం ఆలపించిన కీర్తనలు వీనులవిందుగా సాగాయి. ఈ కార్యక్రమంలో సభ్యులు అగస్త్యరెడ్డి వెంకురెడ్డి, అవనిగడ్డ వెంకటకృష్ణమూర్తి మాట్లాడారు. సాహితీవేత్తలు, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సాలెవీధి వాస్తవ్యురాలు శ్రీరాం సుబ్బమ్మ(70) పరమపదించారు. ఆమె కుటుంబసభ్యుల కోరిక మేరకు సుబ్బమ్మ నేత్రాలను అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ పిఎల్‌రావు ఆధ్వర్యంలో టెక్నిషియన్ ఎండిబి ప్రసాద్ సేకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం సుబ్బారావు, తులసీ వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు



సబ్‌కలెక్టర్‌ను కలిసిన ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం

# కిటకిటలాడిన సబ్‌కలెక్టర్ కార్యాలయం

గూడూరు డివిజన్‌లో వివిధ సమస్యలను బాధితులు సోమవారం సబ్‌కలెక్టర్ గిరీషాకు విన్నవించారు. అర్జీదారులతో సబ్‌కలెక్టర్ కార్యాలయం కిటకిటలాడింది. పట్టణంలో ప్రజలకు ఇళ్ల స్థలాలు, పారిశుధ్యం, వైద్యశాలలో కనీస వసతులు లేవని తదితర సమస్యలపై వామపక్షాల నాయకులు కలిసారు. గూడూరు సబ్‌కలెక్టర్‌ను శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్ కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గూడూరులోని అన్ని ప్రైవేటు స్కూల్సు యాజమాన్యం సబ్‌కలెక్టర్‌ను కలిసారు. దీంతో సబ్‌కలెక్టర్ కార్యాలయం కిటకిటలాడింది.

# ఎస్.వి.రత్నం ట్రస్టు ఆర్థిక సాయం



షర్మిలకు ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు రామ్మోహన్‌రావు, నాగరాజారావు

ఎస్.వి.రత్నం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నాడు చిల్లకూరు మండలం వరగలికి చెందిన షేక్ షర్మిలకు ఇంటర్ ప్రథమ సంవత్సరం డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో చదువుకునేందుకు ఆర్థిక సాయమందించారు. తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు పలు రకాలుగా సాయం అందజేస్తున్నట్లు ట్రస్టు ఛైర్మెన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు, వారి అన్న నాగరాజారావులు తెలిపారు. ట్రస్టు కార్యాలయంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ట్రస్టు ద్వారా సుమారు 70వేలు వరకు పేదవిద్యార్థులకు చదువు కోసం రామ్మోహన్‌రావు భార్య పి.ఎస్.రాజ్యలక్ష్మి స్ఫూర్తితో అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే వారి సిబ్బంది శ్రీనివాసులు ముందుకు వచ్చి షర్మిలకు యూనిఫాం అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు వచ్చి సాయం అందజేయాలని వారు కోరారు.

# రోటరీ ఆట వస్తువుల పంపిణీ




ఆటవస్తువులను అందజేస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు అశోక్‌చక్రవర్తి, ప్రక్కన కె.సుందరరామిరెడ్డి తదితరులు

గూడూరు రోటరీ క్లబ్ వారు కొండాగుంట జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు పదివేల రూపాయల విలువైన క్రీడాపరికరాలను ఇటీవల బహుకరించారు. క్లబ్ అధ్యక్షులు ఎస్.వి. అశోక్‌చక్రవర్తి తన తల్లి స్వర్గీయ ఎస్.వి.శారదమ్మ జ్ఞాపకార్థం ఈ క్రీడాపరికరాలను విరాళంగా అందించారు. క్లబ్ మాజీ అధ్యక్షులు కె.సుందరరామిరెడ్డి ఈ పరికరాలను విద్యార్థులకు స్కూలు ఆవరణలో జరిగిన సమావేశంలో అందజేసి ప్రసంగించారు. విద్యార్థులు జ్ఞానాభివృద్ధితో పాటు క్రీడల ద్వారా శారీరక పుష్టిని కూడా పెంపొందించుకోవాలని ఉద్బోధించారు.

ఈ కార్యక్రమంలో సంధానకర్త బి.శ్యామ్ సుందరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని స్వర్ణలక్ష్మి, రొటేరియన్లు దశరధరామిరెడ్డి, కె.మునిగిరీష్, పి.జానకిరామారెడ్డి, పి.రఘురామిరెడ్డి, వి.వెంకటేశ్వర్లురెడ్డి, పి.వి.కృష్ణయ్య తదితరులతో పాటు పాఠశాల అధ్యాపకులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్ సెక్రటరీ పసుపులేటి మునిరాజా వందన సమర్పణ చేశారు.

## శిరస్త్రాణం ధరించండి
# ప్రాణాలను కాపాడుకోండి



పోలీసులకు శిరస్త్రాణాలు అందజేస్తున్న డిఎస్పీ బి.శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ దేవసేన

శిరస్త్రాణం ధరించడంలో కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని డిఎస్పీ బి.శ్రీనివాస్ అన్నారు. ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి 1వ తేదీ శిరస్త్రాణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిరస్త్రాణం వాడుకుంటే ప్రాణాలకు భద్రత కలుగుతుందన్నారు. జాతీయ రహదారి వెంబడి ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోకుండా కాపాడవచ్చన్నారు. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రోడ్డు భద్రత చట్టంలో ప్రమాదం జరిగిన 48గంటల్లో చికిత్స కోసం అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించేలా బిల్లు తెస్తున్నారన్నారు. ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ శిరస్త్రాణం ధరించని వారికి పోలీసులు అపరాధ రుసుం విధించడం కంటే అప్పుడే ఆ అపరాధ రుసుంతో శిరస్త్రాణం కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కూడా వారి సిబ్బంది అందరూ వాడేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు, ఎస్ఐలు బాబి, గోపాల్, దాతలు పాల్గొన్నారు.

# చదువుతోనే పేదరిక నిర్మూలన

**- ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**



పేదరికాన్ని జయించాలంటే చదువుతోనే సాధ్యమని, తద్వారా ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచించారు. గూడూరు మండలంలోని తిప్పవరప్పాడు గ్రామంలోని పాఠశాలలో లయన్స్ క్లబ్, దివంగత తనూష జ్ఞాపకార్థం ఆమె కుటుంబసభ్యులు విద్యార్థులకు మంగళవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అలాగే విద్యార్థుల బూట్లలకు గాను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తన సొంత నిధులు ఆరు వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. పట్టుదల, కృషి, ఉన్నతాశయంతో అనుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సురేష్‌నాయుడు, కడివేటి చంద్రశేఖర్, మల్లు విజయకుమార్‌రెడ్డి, షేక్ రియాజ్‌అహ్మద్, మెట్టా రాధాకృష్ణారెడ్డి, నవీన్ జయకుమార్, దాత శ్రీనివాసులురెడ్డి, ఎంఇఓ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కలాంకు మహ్మదీయన్ వెల్ఫేర్ నివాళి




మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్

గూడూరులోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ పాఠశాలలో ఆదివారం మాజీరాష్ట్రపతి అబ్దుల్ కలాంకు మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశ సంక్షేమమే సంపదగా కోట్లాది మంది ప్రజల హృదయాలలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని కొనియాడారు. రిటైర్డ్ విశ్రాంత ఉద్యోగి అయప్పరెడ్డి మాట్లాడుతూ కలాం నిరాడంబరత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరిముల్లా, ట్రెజరర్ షేక్ కరిముల్లా, ఔరంగ్ బాషా, అబ్దుల్ రహీం, అనీష్ అహ్మద్, రఫీ, రియాజ్ అహ్మద్, రహంతుల్లా, కౌన్సిలర్ షంషీర్, హెడ్మాస్టర్ పరంజ్యోతి, విద్యార్థులు పాల్గొని కలాంకు నివాళులర్పించారు.

# స్వర్గలోకాధిపతికే క్లాసుపీకిన కలాం

గల్పిక

అది మేఘాలయ రాజధాని షిల్లాంగ్... ఐఐఎంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్నారు. 'గ్రహాంతరయాన జీవనం' అనే అంశంపై ఆయన ఉపన్యాసం సాగుతోంది. విద్యార్థులు చాలాశ్రద్ధగా వింటున్నారు.

★★★★★


అదే సమయంలో ఆన్‌లైన్ ద్వారా స్వర్గలోకాధిపతి కూడా ఆయన ప్రసంగాన్ని చూస్తున్నాడు. కలాం ప్రసంగం వింటుంటే స్వర్గలోకాధిపతికి ముచ్చెమటలు పట్టాయి. ఇతన్ని భూలోకం మీద వదిలేస్తే నవగ్రహాల మీదే కాదు, స్వర్గలోకానికి కూడా రాకెట్లను నడిపి భూమి నుండి జనాన్ని పంపేటట్లున్నాడు. నివాసం ఏర్పరచుకోవడానికి ప్రజలు వస్తే వచ్చారు. చంద్రబాబు లాంటి రాజకీయనాయకులొచ్చారంటే నా కుర్చీకే ఎసరు పెడతాడు. ఈ కలాంను ఇక భూమ్మీద ఉంచకూడదు, స్వర్గలోకానికే రప్పిస్తే సరి అనుకుని తన భటులను పంపించాడు. నలుగురు భటులు కలాం ముందు వాలిపోయారు. కలాం ప్రసంగిస్తుండగానే... మహనీయ, స్వర్గలోకాధిపతి మిమ్మల్ని తీసుకురమ్మన్నారు. స్వర్గలోకానికి మీ సేవలు అవసరమట అని అన్నారు. దానికి కలాం.. అలాగే తప్పక వస్తాను, కాని నేను నా స్టైల్‌లోనే వస్తాను అని చెప్పాడు. ఇలా అంటూ కలాం గాలిలోకి నిటారుగా ఎగిరాడు. షార్ సెంటర్ నుండి వదిలిన పిఎస్ఎల్‌వి రాకెట్‌లా నింగిలోకి దూసుకుపోసాగాడు. ఇలా తొలిదశలోనే రాకెట్ అనబడే ఆయన శరీరం విడిపోగా ఉపగ్రహమనే 'పరమాత్మ' నింగికేసి దూసుకుపోసాగింది. సరిగ్గా భూకక్ష్య దాటే సమయంలో ఆ 'పరమాత్మ' ముందుకు కదలకుండా కక్ష్యలో చేరి భూమి చుట్టూ తిరగసాగింది. స్వర్గలోకం నుండి వచ్చిన భటులు... మహాత్మా, స్వర్గలోకంకు వస్తానని చెప్పి ఇక్కడే భూమి చుట్టూ తిరుగుతున్నారేమని అడిగారు. నాకు ఈ భూమితో, ఈ భారతదేశంతో ఉన్న అనుబంధాన్ని వదులుకోవాలనిలేదు. ఈ భారతదేశానికి నేను చేయాల్సింది ఇంకా ఎంతో వుంది. ఈ దేశాన్ని బాగుచేసే విద్యార్థుల నెందరినో నేను తీర్చిదిద్దాలి. అందుకే ఈ భూమి చుట్టూ నేను తిరుగుతుంటానన్నాడు. భటులు ఇక చేసేదేమీ లేక స్వర్గలోకాధిపతి సెల్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పారు. దీంతో స్వర్గలోకాధిపతే నేరుగా వచ్చి కలాంతో... గురుదేవా, భారతదేశం పట్ల మీరు చూపిస్తున్న ప్రేమకు నా మనసు పులకించిపోతుంది, నీ వంటి మహనీయుడిని కన్న ఆ నేల ఎంతో పవిత్రమైనది. మీలాంటి మహానుభావులు మా లోకంలో వుంటే, మాకూ ఎంతో గౌరవంగా ఉంటుంది. ఇతర లోకాలతో పోలిస్తే మేము టెక్నాలజీ పరంగా ఎంతో వెనుకబడి ఉన్నాము. మీ సేవలు మాకు అవసరం, దయచేసి మా లోకానికి వచ్చి మమ్మల్ని పావనం చేయండని అడిగాడు స్వర్గాధిపతి. దాంతో కలాం కరిగిపోయి ఆయన వెంట స్వర్గలోకానికి వెళ్లాడు.

★★★★★

స్వర్గంలో దారి పొడవునా అబ్దుల్ కలాంకు స్వాగతం చెబుతూ బ్యానర్లు, నిలువెత్తు కటౌట్‌లు కట్టి ఉన్నారు. కలాం అడుగుపెట్టగానే 'మిస్సైల్ మ్యాన్‌కు జై' అనే నినాదాలు మిన్నంటాయి. కలాం అందరికీ అభివాదం చేస్తూ స్వర్గలోకాధిపతి రాజభవనానికి చేరుకున్నారు. స్వర్గలోకాధిపతి అప్పటికే ముఖ్యులందరితో సమావేశం ఏర్పాటు చేసి ఉన్నాడు. కలాంను అక్కడే ఏర్పాటు చేసిన ఒక స్వర్ణ ఆసనం మీద కూర్చోబెట్టి... మన లోకానికి అపూర్వఅతిథి... ఈరోజు నుండి స్వర్గ లోకానికి ఈయనే ప్రధాన శాస్త్ర సలహాదారు అని ప్రకటించారు. ఆ మాట వినగానే అందరూ హర్షధ్వానాలు చేసారు. అయితే కలాం ఇక్కడ అభ్యంతరం వ్యక్తం చేస్తూ... మొదట నేను భారత దేశానికి సేవకుడిని, ఆ దేశానికే నా సేవలు అంకితం... అని అన్నాడు. అందుకు స్వర్గలోకాధిపతి... మహనీయా, మీతోపాటు మేము కూడా మీ దేశం కోసం పాటు పడతాం, ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచంలోని అన్ని దేశాలతో సత్సంబంధాలు కలుపుకుంటున్నాడు. అలాగే స్వర్గలోకంతోనూ భారత్‌కు సంబంధాలు కలిసేలా చేస్తాం, మీరు మా లోకాన్ని మార్చండి అని స్వర్గలోకాధిపతి కోరడంతో కలాంకు అంగీకరించక తప్పలేదు.

స్వర్గలోకంలో మార్పులు చేర్పులకు కలాం శ్రీకారం చుట్టారు. స్వర్గ లోకాధిపతి వుండి... కలాంజీ, ఇతర లోకాల నుండి మన లోకానికి ముప్పు పొంచివుంది. స్వర్గలోకాన్ని ఆక్రమించుకోవాలని కొందరు కుట్రలు పన్నుతున్నారు. మన లోక రక్షణకు అవసరమైన క్షిపణులు తయారు చేయగలరా అని అడిగాడు. అలాగే చేద్దామని చెప్పి అప్పటికప్పుడు స్వర్గలోకంలో క్షిపణి కేంద్రాన్ని ఏర్పాటు చేయించాడు. ఇక స్వర్గలోకం సచివాలయాన్నంతా కంప్యూటర్లు పెట్టించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరిచాడు. అంతకు ముందు సమాచారం కోసం ఉపయోగించే పావురాళ్ల సిస్టంను పూర్తిగా తొలగించాడు. స్వర్గలోకంలో ప్రతి ఇంటికి ఇంటర్నెట్, ప్రతి టవర్‌కు వైఫై వంటివి ఏర్పాటు చేయించాడు. స్వర్గంలోని అన్ని విద్యాసంస్థల్లో క్షిపణి వ్యవస్థ, విశ్వం, గ్రహాలు వంటి అంశాలపై పాఠ్యాంశాలు చేర్పించి, ఆయనే స్వయంగా బోధించసాగాడు. స్వర్గలోకం కాబట్టి ఎక్కడ చూసినా అమృతం ఉండేది. కొళాయిల్లో కూడా అమృతమే. స్నానానికీ అమృతమే... ఇక విశ్వసుందరుల నాట్యాలు... అన్నీ కూడా విలాసవంతమైన సౌకర్యాలే. కలాం వాటన్నింటిని చూస్తుండేవాడేగాని అనుభవించే వాడు కాదు.

ఒకరోజు స్వర్గలోకాధిపతి కలాంను పిలిపించుకుని, కలాంజీ... ఇక్కడ మీకు ఎలా వుంది అని అడిగాడు. స్వర్గలోకానికని చెప్పి స్వర్గం నుండి నన్ను నరకానికి తీసుకొచ్చారేం అని కలాం అడిగాడు. ఆ మాటకు స్వర్గలోకాధిపతి బిత్తరపోయాడు. ఇది స్వర్గమే కదా, ఇక్కడ అమృతం మీకు రుచించలేదా? ఇక్కడ సుందరాంగులు మిమ్మల్ని ఆకర్షించలేదా? ఇక్కడ సంగీతం మిమ్మల్ని ఆకట్టుకోవడం లేదా... ఇది మీకు నరకంలా అనిపిస్తుందా? అని స్వర్గలోకాధిపతి అడిగాడు. అందుకు కలాం... నాకు తెలిసిన స్వర్గం నా భారత దేశమే, అక్కడ హిమగిరుల నుండి పారే గంగా జలం ఇక్కడ లేదు. యం.యస్.సుబ్బలక్ష్మి సంగీతం ఇక్కడ లేదు. జీవితానికి అర్థాన్ని బోధించే సత్యమార్గాన్ని సూచించే పవిత్ర గ్రంథాలు ఇక్కడ లేవు. చిన్నారుల బోసినవ్వులు ఇక్కడ లేవు. దేశం కోసం ప్రాణాలర్పించే వీరసైనికులు ఇక్కడ లేరు. జనగణమన పాట లేదు, వందేమాతరం నినాదం లేదు. మువ్వన్నెల పతాక రెపరెపలు లేవు. మనిషికి మనిషికి మధ్య ప్రేమలు, అనుబంధాలు ఇక్కడ లేవు. అవన్నీ వున్నది నా భారత దేశంలోనే! నా దేశాన్ని మించిన స్వర్గం ఈ విశ్వంలో లేదని ఆయన అనడంతో స్వర్గలోకాధిపతి ఏం మాట్లాడలేక నోరెళ్ల బెట్టాడు.




## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాల అభివృద్ధికై గట్టి కృషి చేస్తారు. ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు సర్దుబాటు కాగలవు. ఉద్యోగులకు స్థాన మార్పులు, అధికారుల సహకారం బాగుంటుంది. చేపట్టిన పనులు టెన్షన్ పెట్టి అనుకూలంగా నెరవేర గలవు. స్థిరాస్తుల కొనుగోలు ప్రయత్నాలు జరగడం, రావలసిన బాకీలు లభించడం జరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థికావకాశాలు, ఉద్యోగావకాశాలు కలిసి రాగలవు. దూరప్రాంత పర్యటనలకు ఆహ్వానాలు లభించడం, శుభకార్యములు నిర్ణయము కావడం జరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయము పెరుగుతుంది. చేపట్టిన పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. అనుకున్న వ్యక్తులు మీకు సహాయపడతారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఈ వారం అదనంగా ఖర్చులుండినా ఆర్థిక ఇబ్బందులుండవు. ఉద్యోగులు అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. స్థానమార్పులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆకర్షణీయ పథకాలతో ముందుకు సాగుతారు. ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. స్థిరాస్తుల పెట్టుబడులపై లాభాలుంటాయి. ఆత్మీయుల నుండి శుభవార్తలు వింటారు. ఉద్యోగులకు అవకాశాలు దొరికే అవకాశమున్నది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కొత్త పెట్టుబడులకు వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు రాగలవు. వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. వృత్తి పరంగా ప్రోత్సాహముండి సంతృప్తి చెందుతారు. అనుకున్న పనులు మీరెంత తొందరపెట్టినా నిదానంగా జరుగును. ఉద్యోగులు ప్రలోభాలకు లోనుకావద్దు. నిర్ణయాలు తొందరపాటుతో జరపకండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. క్రయ విక్రయాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగులు తమ పైఅధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. ప్రభుత్వ అనుమతులు, ఋణాల మంజూరు ఆలస్యం కాగలవు. బాకీల వసూలు వాయిదా పడగలదు. శుభ కార్యాలు నిర్ణయం కాగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాల వృద్ధి ఆశించినంతగా ఉండదు. ఆదాయం తగ్గడం, ఖర్చులు పెరగడం ఉంటుంది. అవసరాలకు ఆర్థికంగా ఇబ్బందులెదుర్కొంటారు. వస్తు వాహన రిపేర్లుంటాయి. నిర్మాణ పనులందు వర్కర్లతో సమస్యలుండగలవు. ఉద్యోగుల పనులపై అధికారులకు అసంతృప్తి కలుగవచ్చును. చేపట్టిన పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల జాగ్రత్త.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 07.08.2015 నుండి
తేది. 13.08.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మేష వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రవికుజులు, సింహంలో గురుబుధ శుక్రులు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

**పంచాంగము:**
ముహూర్తములు లేవు

13తేది గురువారము గురుమౌఢ్యమి ప్రారంభము.

**నిజాషాఢ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 07 | శుక్ర | అష్టమి | రా॥ గం.10.50వ॥ |
| తేది. 08 | శని | నవమి | రా॥ గం.9.03వ॥ |
| తేది. 09 | ఆది | దశమి | రా॥ గం.7.38వ॥ |
| తేది. 10 | సోమ | ఏకాదశి | రా॥ గం.6.35వ॥ |
| తేది. 11 | మంగళ | ద్వాదశి | రా॥ గం.6.05వ॥ |
| తేది. 12 | బుధ | త్రయోదశి | సా॥ గం.5.58వ॥ |
| తేది. 13 | గురు | చతుర్దశి | సా॥ గం.6.24వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక ఇబ్బందుల నుండి క్రమంగా బయట పడతారు. కొత్త ప్రణాళికలతో వ్యాపారాలను నడిపిస్తారు. రాబడి స్వల్పంగా పెరుగుతుంది. ఏ నిర్ణయాలలోనైనా అనుభవపరుల సలహాలు తీసుకొని చేయవలసి ఉంటుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు ఏర్పడటం జరుగుతుంది. గృహోపకరణాలు, ఆధునిక యంత్రాలను కొంటారు. పెట్టుబడుల మీద ఆదాయముంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

చేపట్టిన పనులకు చిన్న ఆటంకాలు రావడం, నిదానంగా జరగడం, ముఖ్యమైన విషయాలందు ఆందోళన చెందడం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తి కరంగా సాగుతాయి. రాబడి స్వల్పంగా పెరుగుతుంది. మీ పలుకుబడి, మీ వ్యాపకాలు పెరుగుతాయి. స్థిరాస్తులు సమకూర్చుకొనే ప్రయత్నాలు జరుగుతాయి. నిరుద్యోగులకు అవకాశాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థికంగా బాగుంటుంది. వనరులకు డబ్బుకు కలిగిన ఇబ్బందులు తొలగుతాయి. ఆదాయానికి తగిన ఖర్చులు పెట్టకతప్పదు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. వాహనాలు నడిపేవారు, విద్యుత్తు, యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా మెలగండి. క్రయ విక్రయాలు వాయిదా వేసికొనడం మంచిది. బిడ్డల వల్ల సమస్యలు రావచ్చును. విద్యాప్రగతి బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

తొందరపాటు నిర్ణయాలు, పట్టుదల, కోపం పెరిగి ఇబ్బందిపడే అవకాశం ఉన్నది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సరిగా ఉండదు. ఆదాయం సామాన్యం, ఇంట, బయట ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ, బంధు వర్గంలో అనారోగ్య బాధలుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. బాకీలు నిలబడిపోవచ్చును. మిత్రులు ఆత్మీయులు మీ ఇబ్బందులకు సహాయపడతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కొత్త ప్రణాళికలు, పథకాలతో వ్యాపారవృద్ధి ప్రయత్నాలు జరుగుతాయి. వృత్తి జీవనం బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. అయితే అనవసర ఖర్చులు కూడా ఉంటాయి. నిరుద్యోగులకు అవకాశాలు వాయిదా పడతాయి. ఉద్యోగులు విధి నిర్వహణలోను అధికారులతోనూ జాగ్రత్తగా ఉండండి. కాంట్రాక్టులు చేసేవారు, నిర్మాణ పనులు చేపట్టిన వారు ఇబ్బందులు పడతారు.

## మీనం




పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

జరగవలసిన పనులు టెన్షన్ పెట్టినా సానుకూలం కాగలవు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక ఇబ్బందులు క్రమంగా సర్దుబాటు కాగలవు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. ఉద్యోగులకు కొత్త అవకాశాలు, స్థానమార్పులుంటాయి. శుభవార్తలు వింటారు. గృహ వస్తువాహన రిపేర్ల ఖర్చులుండ వచ్చును. కుటుంబ సౌఖ్యం, విద్యా ప్రగతి బాగుంటుంది.

# ర్యాగింగ్ నివారణపై దృష్టి

**- జిల్లా ఎస్పీ గజరావు భూపాల్**



ర్యాగింగ్ నివారణపై దృష్టి సారించామని, ర్యాగింగ్ సమాచారాన్ని తెలియజేస్తే గోప్యంగా ఉంచి, ర్యాగింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరుజిల్లా ఎస్పీ గజరావు భూపాల్ పేర్కొన్నారు. సోమవారం జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. సిఐ, ఎస్సై కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి అనంతరం మాట్లాడుతూ ఐ-క్లిక్ సేవల విస్తరింపుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 500పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఈ ఏడాది భర్తీ అయ్యే అవకాశం ఉందన్నారు. నెల్లూరు రూరల్ డిఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్‌పై బుచ్చిరెడ్డిపాళెంలోని పలు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసామన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐ గంగా వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి ఎస్సై శ్యాంసుందర్, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ మణి పాల్గొన్నారు.

# శ్రీసిటీలో కొబెల్కో కొత్త యూనిట్



శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమ కొబెల్కో క్రేన్స్ కొత్త యూనిట్‌ను బుధవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ సీజీబాబా, కొబెల్కో క్రేన్స్ లిమిటెడ్ ప్రెసిడెంట్ సుకమోటొ, శ్రీసిటీ కొబెల్కో యూనిట్ హెడ్ యుటాకా గోటో, జెట్రో డైరెక్టర్ జనరల్ ఇషువా, శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీలో ఓ పరిశ్రమ తమ అదనపు యూనిట్‌ను కొత్త ప్రాంతంలో విస్తరించడం ఇదే ప్రథమం అన్నారు. అలాగే డొమెస్టిక్ డివిజన్‌లో ఎగుమతుల కంపెనీని స్థాపించడం కూడా ఇదే మొట్టమొదటిగా ఆయన పేర్కొన్నారు. 2ఎకరాల స్థలంతో తన మొదటి యూనిట్‌ను ప్రారంభించిన కొబెల్కో ప్రస్తుతం 20ఎకరాల విస్తీర్ణంలో మరో యూనిట్‌ను ప్రారంభించిందన్నారు.

# కోట్లతో నిర్మాణాలు - ఉపయోగం శూన్యం

**• పట్టించుకోని అధికారులు**



నిరుపయోగంగా వున్న కలిగిరి యార్డ్

కలిగిరి, కొండాపురం మండలాల మెట్టప్రాంత రైతులను ఉద్ధరించేందుకు గత ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలో ఉన్న కోట్లాదిరూపాయల నిధులతో కలిగిరి మండలం జల్లావారిపాళెం గ్రామ సమీపంలో ప్రత్తి సేకరణ కేంద్రాన్ని సుమారు 5సంవత్సరాల క్రితం నిర్మించారు. కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన ఈ ప్రత్తి కొనుగోలు యార్డును ఉపయోగించకుండా నిరుపయోగంగా ఏఎంసి అధికారులు వదిలి వేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమను దళారులు దోచుకుంటున్నారని పలు సందర్భాల్లో ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్ళిన మెట్టప్రాంత రైతులు తమ విన్నపాలను మన్నించిన ప్రభుత్వం తమను ఆదుకొనేందుకు కలిగిరి కేంద్రంగా ప్రత్తి కొనుగోలు యార్డును నిర్మించిందని రైతులు ఆనందపడ్డారు. అయితే రైతుల ఆశలను ఏఎంసి అధికారులు అడియాశలు చేయడంపై మండిపడుతున్నారు. వర్షాలు సరిగా



## కావలి కబుర్లు

లేక బోర్లు సహాయంతో పండించిన కొద్దిపాటి పత్తిని దళారుల మాయమాటలతో రైతులను మోసగించటం పరిపాటిగా మారింది. ప్రస్తుతం కావలి ఏఎంసి సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఝాన్సీరాణి మెతకవైఖరి కారణంగా దిగువ స్థాయి సిబ్బంది విధులను సరిగా నిర్వర్తించడం లేదని తెలుస్తోంది. ఈమె సెక్రటరీగా బాధ్యతలు చేపట్టి సుమారు 2 సంవత్సరాలు అయినా కలిగిరిలో పత్తి కొనుగోలు కేంద్రం ఉన్నట్లుగా తెలియకపోవడం ఆమె బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. చెక్‌పోస్టులలో కూడా సిబ్బంది చెస్ వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ తమ జేబులు నింపుకునేందుకు ఆరాటపడుతున్నారు. దీనికి అధికారుల అండదండలు మెండుగా ఉండటం కారణంగా తెలుస్తోంది.

ఇప్పటికైనా నూతన పాలకవర్గం స్పందించి తమ అభివృద్ధికి ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని పునరుద్ధరించి, కనీస మద్దతుధర కల్పించి, చెక్‌పోస్టులలో సిబ్బందిని ప్రక్షాళన చేసి ఏఎంసి ఆదాయాన్ని పెంచాలని మెట్టప్రాంత రైతులు కోరుతున్నారు. అలాగే సెక్రటరీ విధులకు సక్రమంగా హాజరై సిబ్బంది పనితీరు మెరుగు పరిచే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యేకి సన్మానం




ఈ నెల 2వ తేదీన తిరుపతిలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్య సంఘం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాశాలల సమస్యలపై వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి తెలియజేసి మెరుగైన సాంకేతిక విద్యకు కృషి చేస్తానని తెలిపారు.



# మున్సిపల్ అధికారుల మాయాజాలం

**• కార్మికుల నోర్లు కొట్టి 35లక్షల దోపిడీ**

**• కార్మిక సంఘాల ఆందోళన**

కావలి మున్సిపాలిటీలో 2011 నుండి 2014 వరకు మున్సిపల్ అధికారుల అండదండలతో 1వ డివిజన్‌లో పనిచేస్తున్న శానిటరీ ఇన్స్‌పెక్టర్ కార్మికుల నోర్లు కొట్టి సుమారు 35లక్షలు స్వాహా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. శాశ్వత పారిశుద్ధ్య కార్మికులు కొందరితో ఈ శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఓ ఒప్పందం కుదుర్చుకుని పని చేయకుండానే వారికి కొంత డబ్బులు ఇచ్చేందుకు అంగీకరించాడు. ఒప్పందం ప్రకారం కార్మికుల పేర్లతో బ్యాంకుల్లో ఖాతాలు తెరచి ఏటిఎం కార్డులను శానిటరీ ఇన్స్‌పెక్టర్ వద్దనే ఉంచుకుని నెల నెల వారికి మస్టర్లు చేస్తూ వారికి వచ్చే జీతాన్ని కాజేశాడు. అంతటితో ఆగకుండా వారికి వచ్చే ఇంక్రిమెంట్లు, వారి పేర్ల మీద బ్యాంకుల్లో లోన్లు కూడా తీసుకుని కార్మికులను, ప్రభుత్వ ధనాన్ని నిట్ట నిలువునా దోచుకున్నాడు. వీరిలో కొందరిని ప్రజాప్రతినిధుల ఇళ్లకు పాచిపనులకు పంపి ఆయన చేస్తున్న దోపిడీని కప్పిపుచ్చుకోసాగాడు. ఈ అక్రమాలపై గతంలో పలు పత్రికల్లో కథనాలు రావడంతో కార్మిక సంఘాలు అప్పటి కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ అక్రమ సంపాదనను ఆ ఇన్స్‌పెక్టర్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న గుమస్తా నుండి ఉన్నతాధికారులు వరకు మామూళ్ళతో తన అక్రమాలు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డాడని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల పారిశుద్ధ్య కార్మికులు తమ వేతనాలు పెంచాలని విధులను బహిష్కరించగా పురపాలక సంఘం అధికారులు 46మంది శాశ్వత కార్మికులు విధులకు హాజరు కావాలని నోటీసులు జారీ చేయగా 10మంది కార్మికుల అడ్రస్సులు గుర్తించలేకపోయారు. వీరిపై ప్రస్తుత ఇన్‌ఛార్జి కమిషనర్ డి.శ్రీనివాసులు ఆరాతీయగా అసలు వీరు విధులకు ఎప్పుడూ హాజరుకారని, వారి పేర్లతో శానిటరీ ఇన్స్‌పెక్టర్ "డ్రా" చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో ఆ ఇన్స్‌పెక్టర్‌ను 1వ డివిజన్ నుండి కంపోస్టుయార్డుకు బదిలీ చేశారు. అయితే ఇంత అక్రమానికి పాల్పడిన వారిపై విజిలెన్స్ విచారణ చేపట్టి, అక్రమానికి పాల్పడ్డ ఇన్స్‌పెక్టర్, అతనికి సహకరించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. అక్రమాలను ప్రక్షాళన చేస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ డి.శ్రీనివాసులును వారు అభినందిస్తున్నారు.

# ప్రజాసేవలో యువత ముందుండాలి

**- 2వ పట్టణ సిఐ మంగారావు**



యువత ప్రజాసేవలో ముందుండాలని కావలి టూటౌన్ సిఐ మంగారావు అన్నారు. కావలి పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో గోదావరి పుష్కరాల్లో రెడ్‌క్రాస్ తరఫున సేవలందించిన బృందానికి అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సిఐ మంగారావు, డా॥ లక్ష్మీనరసారెడ్డిలు రెడ్‌క్రాస్ యువత బృందం లక్ష్మీనంద, పుష్యమిత్ర, సందీప్, రవికుమార్, సచికేత్‌లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చక్కగా చదువుకుంటూనే ప్రజాసేవలో పాల్గొని సేవ చేయాలన్నారు. గోదావరి పుష్కరాల్లో ప్రమాదం జరిగినప్పుడు దగ్గరుండి వారిని సకాలంలో వైద్యశాలకు తరలించేందుకు సహాయపడిన రెడ్‌క్రాస్ సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ అన్వర్‌బాషా, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జి.ప్రసన్నాంజనేయులు, రవిప్రకాష్, టి.మాల్యాద్రి, డి.సుధీర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలి




కావలి రైతుబజారులో ఎర్రగడ్డలు సబ్సిడీపై కిలో ఇరవై రూపాయల వంతున ఒక్కొక్క కుటుంబానికి 2కేజీలు విక్రయిస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందుకూరి వెంకట సత్యనారాయణ కోరారు. సోమవారం ఆయన రైతుబజారులో ఎర్రగడ్డల అమ్మకాన్ని పరిశీలించారు. మార్కెట్‌లో కిలో 40రూపాయల నుండి 50రూపాయలకు అమ్ముతున్న ఎర్రగడ్డలను బీజేపీ, మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం సబ్సిడీపై విక్రయించి, ప్రజలను ఆదుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కావలి రైతు బజారుకు 19,000 కిలోల ఎర్రగడ్డలు మంజూరయ్యాయని, గత నెల 30వ తేదీ నుండి ఈ నెల 2వ తేదీ వరకు అమ్మకాలు పోను సోమవారానికి 9,150కిలోల స్టాకు వుందని తెలిపారు. అవసరమైతే జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి సరిపడినంత స్టాకును తెప్పిస్తామని తెలిపారు. ఆయనతో పాటు బీజేపీ కావలి రూరల్ మండల అధ్యక్షుడు పాటిబండ్ల నరేంద్ర, ఉపాధ్యక్షుడు ఆర్.జయరాంరెడ్డి, సీనియర్ నాయకులు పి.కృష్ణయ్యనాయుడు తదితరులు రైతుబజారులో ఎర్రగడ్డల అమ్మకాన్ని పరిశీలించారు.

## మూడుహాళ్ళు

# 'బాహుబలి' బ్లాక్ టిక్కెట్లపై కళ్ళు తిరిగే కలక్షన్

## • 14 రోజుల్లో 'బ్లాక్' టిక్కెట్లపై వచ్చింది సుమారు 2కోట్లపైనే



నెల్లూరులోని మాగుంటోళ్ళ యాజమాన్యంలో నిర్వహిస్తున్న సినిమా హాళ్ళలో జరుగుతున్న 'బ్లాక్' టిక్కెట్ల కుంభకోణాన్ని లోతుగా పరిశీలిస్తే కళ్లు తిరిగే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఈ హాళ్ళలో మేనేజర్లే డిస్ట్రిబ్యూటర్ల అవతారం ఎత్తి హాలు యజమానులకు కూడా తెలియకుండా కోట్లు దోచేస్తున్న వైనం బయటపడుతోంది. రికార్డ్ బ్రేక్ కలెక్షన్‌లతో భారతదేశం మొత్తం సంచలనం సృష్టించిన 'బాహుబలి' సినిమాకి ఎస్1, ఎస్2, ఎస్3లతో పాటు లీలామహల్, అర్చన థియేటర్లతో కలిపి వసూలైన 'బ్లాక్' టిక్కెట్ల కలక్షన్ కూడా రికార్డు స్థాయిలోనే వుందనిపిస్తోంది.

ఎస్2 సముదాయంలోని మూడు స్క్రీన్‌లలో రోజుకి 15షోలు ప్రదర్శించగా లీలామహల్‌లో 4, అర్చనలో 4 కలిపితే బాహుబలి రోజుకి 23షోలు ఆడించారు. సుమారు రెండు వారాల పాటు రోజుకి 23లెక్కన దాదాపుగా 320షోలు ప్రదర్శింపబడ్డాయి. ఈ 320షోలకు ఒక్కొక్క షోకి 100 టిక్కెట్ల లెక్కన బ్లాక్ మార్కెట్లోకి వెళ్ళినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అంటే 32,000టిక్కెట్లు. వీటిల్లో 12,000టిక్కెట్లు రెకమండేషన్లు, ఆబ్లిగేషన్లకి పోయినా సుమారు 20,000టిక్కెట్లు ఒక్కొక్కటి యావరేజ్‌న 1000రూపాయల లెక్కన 'బ్లాక్' మార్కెట్లో అమ్ముడుపోయాయి. (కొన్ని షోలకు టిక్కెట్టు 3వేల నుండి 5వేలు పలికినా యావరేజ్ 1000 లెక్కన తీసుకుంటున్నాం) అంటే 20,000 ×1,000 రూపాయలు = 2కోట్లు. అమ్మ బాబోయ్... ఇదే తంతు రేపు 'శ్రీమంతుడు'కి కూడా కొనసాగితే నిర్మాత కంటే 'బ్లాక్' బాబులే శ్రీమంతులయ్యే అవకాశాలున్నాయి. కేవలం 2వారాల్లో 2కోట్లు బ్లాక్‌దందాలో సంపాదిస్తున్నారంటే వీళ్లు ఈ తరహా సంపాదనకు ఎలా అలవాటు పడి ప్రేక్షకులను దోచేస్తున్నారో అర్థమౌతుంది. ఇప్పటికైనా థియేటర్ల యాజమాన్యం మేల్కొని అంతుచిక్కని స్థాయిలో కోట్ల రూపాయల రాబడితో సాగుతున్న 'బ్లాక్' వ్యవహారాన్ని వెంటనే అడ్డుకోవాల్సి వుంది. లేదంటే ఈ వ్యవహారంలో వారికి కూడా ఇందులో భాగముందేమోనన్న అనుమానం ప్రేక్షకుల్లో కలిగే ప్రమాదం వుంది. ఇది కేవలం పై'రవి'కారుల స్థాయిలో జరుగుతుందని అనుకోవడం కూడా కష్టమే. ఖచ్చితంగా ఇక్కడ ఆది"ప"త్యం చెలాయించేవారికి తెలియకుండా ఇంతపెద్ద మొత్తం సంబంధించిన వ్యవహారం జరగడం సామాన్యమైన "లీల" కాదు.

**మాగుంట గ్రూప్‌కు చెందిన మొత్తం సినిమాహాళ్ళ కెపాసిటి పరిశీలిస్తే...**

| హాలు పేరు | యస్1 | యస్2 | యస్3 | యస్4 లీలామహల్ | అర్చన |
|---|---|---|---|---|---|
| టిక్కెట్ల ధర | సీట్లు | సీట్లు | సీట్లు | సీట్లు | సీట్లు |
| రూ. 130 | 12 | 16 | 14 | - | - |
| రూ. 110 | 442 | 518 | 251 | - | - |
| రూ. 60 | 108 | 92 | 68 | - | - |
| రూ. 100 | - | - | - | 187 | - |
| రూ. 80 | - | - | - | 253 | - |
| రూ. 50 | - | - | - | 40 | - |
| రూ. 75 | - | - | - | - | 250 |
| రూ. 60 | - | - | - | - | 250 |
| రూ. 40 | - | - | - | - | 150 |
| రూ. 20 | - | - | - | - | 163 |
| మొత్తం సీట్లు | 562 | 626 | 333 | 480 | 813 |

5హాళ్ళు కలిపి మొత్తం సీట్లు 2,814

## బ్లాక్ టిక్కెట్ల వార్తకి
# "ఇంటర్‌నెట్‌లో విశేష స్పందన"

గతవారం 'లాయర్'లో వచ్చిన "మూడు హాళ్ళలో బ్లాక్ టిక్కెట్ల దందా" వార్తకి అంతర్జాతీయంగా విశేష స్పందన లభించింది. ప్రపంచ వ్యాప్తంగా నెట్ ద్వారా అలాగే ఫేస్‌బుక్ ద్వారా ఈ వార్త చదివిన వేలాదిమంది తమ 'లైక్'ల ద్వారా 'లాయర్'ని అభినందించారు. కొంతమంది నెట్‌జనులైతే ఈ విషయమై తీవ్రంగా స్పందించారు. ఈ విషయమై స్పందించిన గిద్దలూరు నాగేశ్వరరావు మూడుహాళ్ళలో వాటర్ బాటిల్ అరలీటర్‌కి 30రూపాయలు వసూలు చేస్తున్నారని, ఆ విధంగా కూడా ప్రేక్షకులను దోచేస్తున్నారని అన్నారు. వాస్తవ వార్తను వ్రాసిన 'లాయర్'కి అభినందనలు అంటూ "పవనిజమ్" గ్రూప్‌వాళ్ళు నెట్‌లో సైతం టిక్కెట్లు లేవని మొత్తం బ్లాక్‌లో అమ్మేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. "ఇది చాలా దారుణమైన వ్యాపారం" అంటూ వుమర్ షేక్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. స్టాఫ్‌కి 5వేలకి మించి జీతం ఇవ్వరు, అందుకే వాళ్లు ఇలా చేస్తున్నారంటూ కొనె చైతూ చేసిన కామెంట్‌కి గిద్దలూరు నాగరాజారావు స్పందిస్తూ జీతాలు ఇవ్వకపోతే యాజమాన్యాన్ని అడగాలికాని ఇలా బ్లాక్ టిక్కెట్లు అమ్మడాన్ని మనం సమర్థిస్తే రేపు వాళ్ళు పిక్‌పాకెటింగ్ కూడా చేస్తారని ఘాటుగా విమర్శించాడు.

ప్రజలకు మంచి వార్తనిచ్చిన 'లాయర్'కు మా అభినందనలు అంటూ ప్రేక్షకులను గుంటనక్కలా పీక్కుతినడం అన్యాయం అంటూ ఇక్కడ మేనేజర్ల పేర్లను సైతం పొందుపరుస్తూ భవాని దూళిపాళ్ళ తన నిరసన వ్యక్తం చేశాడు. కృష్ణాజిల్లాలో నేరుగా జిల్లా కలెక్టరే 'బాహుబలి' బ్లాక్ మార్కెట్‌ను కంట్రోల్ చేసినట్లు ఇక్కడ కూడా జిల్లా యంత్రాంగం వీళ్ళ తోక కత్తిరించాలంటూ ప్రేక్షకుల్లో కూడా మార్పు వచ్చి బ్లాక్ టిక్కెట్లు కొనడం మానేయాలంటూ యజ్ఞేష్‌సింగ్ పోస్ట్ చేశాడు.

ఇక్కడున్న మేనేజర్లు అందరూ పెద్ద స్కామర్స్ అని అర్థరాత్రి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో పెట్టి ఓ గంటకల్లా అయిపోయాయని చూపిస్తారని అంటూ, ఎక్కువ 'లో క్లాస్' టిక్కెట్లు ఆన్‌లైన్‌లో పెడుతున్నారని, ఎస్2 వాళ్ళిచ్చిన ఫ్యూయల్ కార్డ్స్ కూడా అంతా బోగస్ అని, దండగని, క్యాంటిన్‌లో స్నాక్స్ దగ్గర నుండి టిక్కెట్ల దాకా అంతా దోపిడీయేనని, ఇదంతా ఓ కీలకవ్యక్తి నడిపిస్తున్నాడని, అతన్ని పీకిపారేస్తే అంతా బాగుపడుతుందని శ్రీకాంత్ మల్లి కొంచెం ఘాటుగానే దుమ్మెత్తి పోశాడు.

ఇలా వ్రాసుకుంటూవెళ్తే వందల కామెంట్స్, వేల లైక్స్ ఈ వార్తపై వచ్చాయి. "లాయర్" ప్రజల దృష్టికి తెచ్చిన వాస్తవ వార్తకి విశేషంగా స్పందిస్తున్న వారందరికీ ధన్యవాదాలు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



శ్రీ సన్నపురెడ్డి జనార్ధన్‌రెడ్డి గారు
(కీ.శే. సన్నపురెడ్డి వెంకట సుబ్బారెడ్డి గారి జ్యేష్ఠ పుత్రుడు)
జననం: 04-09-1950 మరణం: 03-08-2015

# ఉత్తరక్రియలు

పూజ్యులు, మా ఇంటి దైవం, మాకు మార్గదర్శకులు

## శ్రీ సన్నపురెడ్డి జనార్ధన్‌రెడ్డి గారు

తేది 03-08-2015 సోమవారం నాడు స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతి కలుగచేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

**ఉత్తరక్రియలు : తేది 15-08-2015 శనివారం నాడు**
నెల్లూరు, టెక్కేమిట్ట, నిషిత అపార్ట్‌మెంట్‌లోని మా స్వగృహము నందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

| కుమారుడు-కోడలు | కుమార్తె - అల్లుడు |
|---|---|
| సన్నపురెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి - మాధవి | జ్యోతి - బద్వేలు సుబ్బారెడ్డి |
| మనుమరాలు - అక్షయ | మనుమరాలు - సోహిని |

మరియు కుటుంబ సభ్యులు

cynosure homez Bangalore
VAMSIRAM BUILDERS Hyderabad

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

హిందూ ధర్మప్రచార పరిషత్తు


# శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవములు - 2015


**తేది 08-08-2015 నుండి 16-08-2015 వరకు**

**ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం, మెయిన్ రోడ్, నెల్లూరు**



గమనిక: సేవలలో దంపతులు సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించాలి


















**రండి! శ్రీవారి కైంకర్యాలను ప్రత్యక్షంగా వీక్షించండి!! తరించండి!!!**

**అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని నిత్య సేవలైన సుప్రభాతం మొదలుకొని, వారోత్సవ సేవలను చూచి తరించండి!**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com